తెలంగాణ
TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | శుక్రవారం - 15 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 347 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## గ్రేహౌండ్స్ దళంపై డీజీపీ సమీక్ష

- గ్రేహౌండ్స్ దళం పనితీరుపై సమీక్ష
- బలగాల కుదింపు పునర్వ్యవస్థీకరణపై చర్చ
- వచ్చే ఐదేళ్ల కోసం వ్యూహాత్మక ప్రణాళిక

**హైదరాబాద్, మే 14 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర పోలీసు విభాగంలోని ఎలైట్ విభాగమైన 'గ్రేహౌండ్స్' ప్రధాన కార్యాలయాన్ని రాష్ట్ర డీజీపీ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా బలగాల సంసిద్ధత, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలు దాదాపుగా ముగిసిపోయిన నేపథ్యంలో, గ్రేహౌండ్స్ దళాన్ని పునర్వ్యవస్థీకరించాల్సిన ఆవశ్యకతపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. భవిష్యత్తులో తలెత్తే సంక్షోభాలను ఎదుర్కోవడానికి కనీస బలగాల సంఖ్య ఎంత ఉండాలనే అంశంపై దృష్టి సారించారు. ఈ సమావేశంలో బలగాల ఆధునీకరణ మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రధానంగా చర్చలు జరిగాయి. గ్రేహౌండ్స్ దళం యొక్క సామర్థ్యాన్ని మరింత పెంచడానికి అధునాతన శిక్షణ, పరిపాలనాపరమైన మద్దతు అవసరమని డీజీపీ అభిప్రాయపడ్డారు. జవాన్ల సంక్షేమం కోసం చేపట్టాల్సిన నూతన కార్యక్రమాలపై కూడా ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ఈ ఎలైట్ యూనిట్‌ను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్ల కాలానికి సంబంధించి ఒక వ్యూహాత్మక విజన్‌ను డీజీపీ ఈ సందర్భంగా ఆవిష్కరించారు. గ్రేహౌండ్స్ బలగాలు ఎల్లప్పుడూ చురుగ్గా, సాంకేతికంగా బలోపేతంగా ఉండేలా చూడటమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యం. యుద్ధ తంత్రాలు మరియు వ్యూహాలలో వస్తున్న మార్పులకు అనుగుణంగా జవాన్లకు శిక్షణ

మిగతా 2లో..

## నీట్ పరీక్ష రద్దుపై సీఎం రేవంత్ ఆందోళన

### విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు
### పారదర్శక దర్యాప్తు జరపాలని కేంద్రానికి విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 14 (తెలంగాణ ముచ్చట్లు):** నీట్ యూజీ-2026 పరీక్ష రద్దు నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిపోయిందని పేర్కొన్నారు. పోటీ పరీక్షలు ప్రతిభకు వేదిక కావాల్సిందిపోయి ఆందోళన, అస్థిరతకు కారణమవుతున్నాయని విమర్శించారు.



మే 3న దేశవ్యాప్తంగా 551 నగరాల్లో, విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించిన నీట్ యూజీ-2026 పరీక్షకు సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు హాజరైనట్లు సీఎం పేర్కొన్నారు. ఇప్పుడు పరీక్ష రద్దు కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీ, అవకతవకలు విద్యా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి పరీక్షల విశ్వసనీయతను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీలకు పాల్పడిన వ్యక్తులు, నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారి స్థాయి, ప్రభావం ఎలా ఉన్నా చట్టపరమైన కఠిన శిక్షలు విధించాలని కోరారు. నీట్ పరీక్ష వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పారదర్శకంగా, వేగవంతంగా దర్యాప్తు జరపాలని సీఎం విజ్ఞప్తి చేశారు. వ్యవస్థలోని వైఫల్యాల కారణంగా అమాయక విద్యార్థులు మళ్లీ మళ్లీ నష్టపోకూడదని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో సాంకేతిక భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

మిగతా 2లో..



## సింగరేణికి పూర్వవైభవం తెస్తాం

- మంత్రి వివేక్ వెంకటస్వామి
- కొత్త గనులు, కొత్త ఉద్యోగాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- కేకే-5 భూగర్భ గనిలోకి వెళ్లి కార్మికులతో కలిసి పర్యటించిన మంత్రి

**హైదరాబాద్, మే 14 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి సంస్థకు పూర్వవైభవం తీసుకురావడమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. కొత్త గనుల ప్రారంభం ద్వారా నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన ప్రకటించారు. గురువారం మందమర్రి ఏరియాలోని కేకే5 భూగర్భ గనిలోకి స్వయంగా వెళ్లిన మంత్రి, కార్మికులతో కలిసి పర్యటించారు. గని లోపల పని పరిస్థితులను పరిశీలించడంతో పాటు కార్మికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీఆర్పీ బకాయిలకు సంబంధించిన ఆదాయపు పన్ను సమస్యలు పరిష్కరించాలని, సొంతింటి కల నెరవేర్చాలని కార్మికులు ఈ సందర్భంగా మంత్రిని కోరారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మంత్రి వివేక్ విమర్శించారు. గత పదేళ్లలో సంస్థను ఆర్థికంగా దోచుకున్నారే తప్ప ఒక్క కొత్త గనిని కూడా ప్రారంభించలేదని ఆయన మండిపడ్డారు. సింగరేణి కార్మికులు పూర్తి రక్షణ ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించడంపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కేకే5 గనిలో శ్రమశక్తి అవార్డు గ్రహీత ఏడుకోల పవన్ కుమార్‌కు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాకా కుటుంబానికి సింగరేణి కార్మికులతో విడదీయలేని అనుబంధం ఉందని, సంస్థ అభివృద్ధి కోసం అధికారులు, కార్మికులు సమిష్టిగా బాధ్యతాయుతంగా

మిగతా 2లో..

## ఇంధన పొదుపుపై గవర్నర్ పిలుపు

- అధికార వాహనాల వినియోగాన్ని 50 శాతం తగ్గిస్తున్న లోక్ భవన్
- ప్రధాని పిలుపును అందరూ పాటించాలని సూచన

**హైదరాబాద్, మే 14 (తెలంగాణ ముచ్చట్లు):** అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన ఇంధన సంక్షోభ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ఇంధన పొదుపుపై ఇచ్చిన పిలుపును తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రశంసించారు. జాతీయ ప్రయోజనాల పరిరక్షణ కోసం ప్రధాని స్వయంగా తన కాన్వాయ్ పరిమాణాన్ని తగ్గించడం ఆదర్శనీయమని పేర్కొన్నారు.
గవర్నర్ మాట్లాడుతూ తాను లోక్ భవన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వాహనాల వినియోగాన్ని తగ్గించే విధానాన్ని అనుసరిస్తున్నట్లు తెలిపారు. ఇంధన పొదుపుతో పాటు విదేశీ మారకద్రవ్య వ్యయాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ధనాన్ని ఆదా చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో లోక్ భవన్‌లో అధికారిక వాహనాల వినియోగాన్ని 50 శాతం మేర తగ్గించాలని నిర్ణయం తీసుకున్నట్లు గవర్నర్ వెల్లడించారు. అవసరమైన సందర్భాల్లో మాత్రమే వాహనాలను వినియోగించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో ఇంధన పొదుపు చర్యలు మరింత విస్తరించాలని సూచించారు.
రాష్ట్రంలోని అన్ని శాఖలకు కూడా ఇదే విధమైన మార్గదర్శకాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిను గవర్నర్ కోరారు. ప్రభుత్వ వాహనాల వినియోగాన్ని సమర్థవంతంగా నియంత్రించే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమిష్టిగా ఇంధన సంరక్షణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇంధన పొదుపు కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని గవర్నర్

మిగతా 2లో..



## ప్రతిపక్షాల దొంగ మాటలు నమ్మొద్దు

- మంత్రి పొంగులేటి
- రైతులను ఇబ్బంది పెట్టిన వారే ఇప్పుడు ప్రేమ నటిస్తున్నారని విమర్శ
- ప్రజా పాలన కార్యక్రమంలో ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు

**ఖమ్మం, మే 14 (తెలంగాణ ముచ్చట్లు):** పదేళ్లపాటు రైతులను ఇబ్బందులకు గురిచేసిన వారు ఇప్పుడు రంగురంగుల అవతారాలు ఎత్తుకుని ప్రజల ముందుకు వచ్చినా ఎవరూ నమ్మే పరిస్థితి లేదని మంత్రి పొంగులేటి



శ్రీనివాసరెడ్డి ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన “ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక” క్లస్టర్ 1 సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు వరి వేస్తే ఉరి అంటూ రైతులను భయపెట్టిన వారే ఇప్పుడు రైతుల కోసం పోరాటం చేస్తున్నామంటూ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. ఫోటోలకు ఫోజులు ఇస్తూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. పదేళ్ల పాలనలో అధికారులు పేదల గడప వద్దకు వెళ్లలేదని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుంటోందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని మంత్రి విమర్శించారు. ప్రజల్లో అపోహలు సృష్టిస్తూ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల ఆశీస్సులు ఉన్నంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరూ ఏమీ చేయలేరని స్పష్టం చేశారు. మూడు, నాలుగు సార్లు ఎన్నికల్లో ప్రజలు

మిగతా 2లో..

## సంగారెడ్డిలో భారీ ఫుడ్ ఇండస్ట్రీకి శ్రీకారం

- రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు
- స్థానిక మహిళలకు 1,500 ఉపాధి అవకాశాలు
- రేపు కేజేఎస్ యూనిట్–II శంకుస్థాపన

**సంగారెడ్డి, మే 14 (తెలంగాణ ముచ్చట్లు):** సంగారెడ్డి జిల్లాలో భారీ ఫుడ్ ఇండస్ట్రీ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల విస్తీర్ణంలో కేజేఎస్ యూనిట్-II పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు. మహిళలకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ పరిశ్రమ ద్వారా సుమారు 1,500 మంది స్థానిక మహిళలకు ఉపాధి లభించనున్నట్లు సమాచారం.కొండాపూర్ మండలం తొగర్పల్లి, అలియాబాద్ గ్రామాల పరిధిలో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమకు రేపు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. పరిశ్రమ స్థాపనతో ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రాజెక్టు సంగారెడ్డికి రావడంలో జగ్గారెడ్డి, నిర్మల కృషి కీలకంగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి సహకారంతో పరిశ్రమ సంగారెడ్డికి

మిగతా 2లో..





## సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్లు

- చరిత్రలో తొలిసారి మహిళా ఆపరేటర్లు
- భారీ డంపర్ల నిర్వహణకు సన్నద్ధం
- మహిళా సాధికారతకు విప్లవాత్మక అడుగు

**హైదరాబాద్, మే 14 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తన 130 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో మరో అద్భుత ఘట్టానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా సాధికారతను ప్రోత్సహిస్తూ తొలిసారిగా మహిళలను హెవీ డంపర్ ఆపరేటర్లుగా నియమించాలని యాజమాన్యం నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో సింగరేణిలో మహిళా ఉద్యోగులకు ప్రాధాన్యత పెంచేలా ఈ విప్లవాత్మక చర్యలు చేపట్టారు. ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌లో బొగ్గు రవాణా కోసం వినియోగించే 60 నుండి 100 టన్నుల సామర్థ్యం గల భారీ డంపర్లను ఇకపై మహిళా సిబ్బంది కూడా నడపనున్నారు. గత ఐదు దశాబ్దాలుగా ఓపెన్‌కాస్ట్ గనుల్లో కేవలం పురుషులు మాత్రమే ఈ భారీ వాహనాలను నడుపుతున్నారు. శారీరక శ్రమ, ఓపిక, విపరీతమైన వాతావరణ పరిస్థితుల్లో మూడు షిఫ్టుల్లో పనిచేయాల్సి ఉండటంతో ఇప్పటి వరకు మహిళలను ఈ విధులకు దూరంగా ఉంచారు. అయితే నేటి కాలంలో మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్న నేపథ్యంలో వారికి సవాల్‌తో కూడిన బాధ్యతలు అప్పగించాలని

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్లు

(మొదటి పేజీ తరువాయి)

యాజమాన్యం నిర్ణయించింది. ఆసక్తి గల మహిళా ఉద్యోగుల నుండి దరఖాస్తులు కోరగా సుమారు 35 మంది ముందుకు వచ్చారు. భారీ వాహనాలను నడిపేందుకు అవసరమైన హెవీ మోటార్ వెహికల్ లైసెన్స్ కోసం కంపెనీయే స్వయంగా వారికి శిక్షణ ఏర్పాట్లు చేసింది.

సిరిసిల్లలోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ లో కంపెనీ ఖర్చుతోనే మహిళా ఉద్యోగులకు శిక్షణ ఇప్పించారు. మొత్తం 13 మంది మహిళా ఉద్యోగులు హెచ్‌ఎమ్‌వి శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని డంపర్ ఆపరేటర్లుగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు యాజమాన్యానికి తెలిపారు. రాబోయే డంపర్ ఆపరేటర్ల రిక్రూట్‌మెంట్‌లో వీరికి అవకాశం కల్పించనున్నారు. శారీరక శ్రమతో కూడిన రంగాల్లో కూడా మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సింగరేణి సంస్థ కొత్త చరిత్రను లిఖిస్తోందని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. త్వరలోనే సింగరేణి గనుల్లో మహిళలు భారీ డంపర్లను నడుపుతూ కనిపించనున్నారు. ప్రారంభంలో ఈ భారీ వాహనాలను నడపడంపై తమకు కొంత ఆందోళన కలిగినప్పటికీ శిక్షణ పొందిన తర్వాత పూర్తి ఆత్మవిశ్వాసం వచ్చిందని మహిళా ఉద్యోగులు తెలిపారు. మహిళలు అంతరిక్ష యానంలో కూడా రాణిస్తున్నప్పుడు గనుల్లో డంపర్లు నడపడం అసాధ్యమేమీ కాదని వారు అభిప్రాయపడ్డారు. తమకు ఈ అరుదైన అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. పురుషులతో సమానంగా తాము కూడా కష్టపడగలమని వారు నిరూపించేందుకు సిద్ధమయ్యారు. సింగరేణి మైనింగ్ చరిత్రలో ఇదొక గొప్ప మలుపు అని సామాజిక విశ్లేషకులు భావిస్తున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సింగరేణిలో ఇప్పటికే మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి పలు చర్యలు తీసుకున్నారు. బెల్లంపల్లిలోని ఖైరిగూడ ఓపెన్‌కాస్ట్ గనిలో బ్లాస్టింగ్ విభాగం వంటి అత్యంత క్లిష్టమైన విధుల్లో ఇప్పటికే మహిళలు విజయవంతంగా పనిచేస్తున్నారు. అంతేకాకుండా సింగరేణి చరిత్రలోనే తొలిసారిగా మహిళా రెస్క్యూ టీమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. రాబోయే రోజుల్లో మహిళా ఉద్యోగులకు మరిన్ని సవాల్‌తో కూడిన బాధ్యతలను అప్పగిస్తూ వారిని ప్రోత్సహిస్తామని అధికారులు తెలిపారు. సింగరేణి తీసుకుంటున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా మైనింగ్ రంగంలో మహిళా సాధికారతకు ఒక దిక్సూచిగా నిలవనుంది.

# సంగారెడ్డిలో భారీ ఫుడ్ ఇండస్ట్రీకి శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

తరలివచ్చినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉండటంతో పారిశ్రామిక సంస్థలు తెలంగాణ వైపు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు.

ఈ పరిశ్రమ ఏర్పాటుతో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు పెరగడంతో పాటు మహిళల ఆర్థిక సాధికారతకు దోహదం కానుందని అధికారులు పేర్కొన్నారు. ఆహార ప్రాసెసింగ్ రంగంలో ఆధునిక సాంకేతికతతో పరిశ్రమ కార్యకలాపాలు కొనసాగనున్నట్లు తెలిపారు. స్థానికంగా ఉపాధి లభించడం వల్ల గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. సంగారెడ్డి జిల్లాను పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని నాయకులు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక అభివృద్ధి, ఉపాధి, మౌలిక సదుపాయాల విస్తరణకు ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులను జిల్లాకు తీసుకురావడానికి చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు।

# ప్రజా ప్రభుత్వంలో పిడమర్తి రవికి సముచిత స్థానం కల్పించాలి

### ఓయూ జేఏసీ నాయకుల డిమాండ్



**హైదరాబాద్,మే14(తెలంగాణ ముచ్చట్లు):** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన నాయకుడు, ఓయూ జేఏసీ మాజీ చైర్మన్, బీఎస్ఎఫ్ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవికి ప్రజా ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాలని ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. డాక్టర్ పిడమర్తి రవి జన్మదినాన్ని పురస్కరించుకొని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బొరెల్లి సురేష్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి, ఉద్యమ నాయకులు మాట్లాడారు. బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక ఉద్యమాలు, త్యాగాలు చేసిన డాక్టర్ పిడమర్తి రవికి ప్రజా ప్రభుత్వంలో తగిన గుర్తింపు లేకపోవడం ఉద్యమకారులకు అవమానకరమని అన్నారు. తెలంగాణ కోసం కృషి చేసిన నాయకులను గౌరవిస్తూ వారికి ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రజల భావజాలంపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడు పిడమర్తి రవి అని పేర్కొన్నారు. రాష్ట్ర అస్తిత్వం, ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించే నాయకత్వ లక్షణాలు ఆయనలో ఉన్నాయని అన్నారు. అలాంటి ఉద్యమ నాయకుడికి ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ దీర్ఘకాలం బలంగా నిలవాలంటే ఉద్యమ నాయకులను గౌరవించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మొగిలిగిద్ద ప్రసాద్, ఓయూ అధ్యక్షుడు కల్వకుర్తి శ్రీశైలం, ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి, బీఎస్ఎఫ్ ఓయూ ఉపాధ్యక్షుడు ఆరెకంటి శ్రీకాంత్, ఏఐబీఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల మధు యాదవ్, జేవీఎస్ విద్యార్థి సంఘం అధ్యక్షుడు చేరాల వంశీ, ఎన్ఎస్‌యూఐ నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





# ధాన్యం కొనుగోళ్లపై మండిపడ్డ సండ్ర

- 45 రోజులైనా రైతులకు ఉపశమనం లేదు.
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర నష్టాల్లోకి వెళ్లారన్న మాజీ ఎమ్మెల్యే

**సత్తుపల్లి, మే 14 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వరి కోతలు ప్రారంభమై 45 రోజులు గడిచినా రైతులకు సరైన కొనుగోలు సదుపాయాలు కల్పించలేదన్నారు. ప్రభుత్వం ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంతో జిల్లాలో 70 శాతం పైగా ధాన్యం ఇప్పటికే వ్యాపారస్తుల చేతికి వెళ్లిపోయిందని ఆరోపించారు. రైతులు క్వింటాకు రూ.500 వరకు నష్టపోయి తక్కువ ధరకే ధాన్యం విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కాకర్లపల్లి, బుగ్గపాడు గ్రామాల్లో ఇప్పటికీ రోడ్లపైనే ధాన్యం రాశులు కనిపిస్తున్నాయని, ఇటీవల కురిసిన వర్షాలతో ధాన్యం మొలకెత్తిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మా ప్రభుత్వం కేసీఆర్ హయాంలో పంటల కొనుగోళ్లకు ముందుగానే సమగ్ర ప్రణాళిక రూపొందించి బస్తాలు, కొనుగోలు కేంద్రాలు, తేమ కొలిచే యంత్రాలు, మిల్లులు, గోదాములు సిద్ధం చేసేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం మాత్రం ఏప్రిల్ 6న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేసరికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. మిల్లర్ల వద్ద క్వింటాకు 12 కిలోల వరకు తరుగు వేస్తున్నారని, లారీలు రోజుల తరబడి వేచి ఉండాల్సి రావడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. కల్లూరు గోదాములో ఒక ట్రాక్టర్ మొక్కజొన్న దింపడానికి 15 రోజుల వరకు ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలో 2.40 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని, మద్దతు ధర రూ.2450 ప్రకటించినప్పటికీ ప్రస్తుతం రైతులు రూ.1500 1600కే అమ్ముకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీంతో క్వింటాకు రూ.800 వరకు నష్టం వాటిల్లుతోందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సత్తుపల్లి నియోజకవర్గంలో యాసంగి సీజన్‌లో భారీ స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు జరిగేవని తెలిపారు. ప్రస్తుతం కాకర్లపల్లి సొసైటీలో ఈ సీజన్‌లో ఒక్క కొనుగోలు కేంద్రంలోనే కేవలం 13 లారీల ధాన్యం మాత్రమే కొనుగోలు జరిగిందని పేర్కొన్నారు. దీన్నిబట్టి ప్రభుత్వ చిత్తశుద్ధి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందన్నారు. సన్నధాన్యానికి బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా, ఇప్పటికే 70 శాతం మంది రైతులు బయటే ధాన్యం విక్రయించారని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వ కేంద్రాల్లో అమ్మిన రైతులకే బోనస్ ఇస్తే మిగిలిన రైతులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల వారీగా సన్నధాన్యం సాగు చేసిన రైతులను గుర్తించి బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. బస్తాల పంపిణీలో రాజకీయ జోక్యం పెరిగిపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు సూచించిన వారికే బస్తాలు, కార్డులు ఇస్తున్నారని విమర్శించారు. రైతు వేదికలు, సొసైటీ భవనాలు వినియోగించకుండా కొనుగోలు కేంద్రాలను రాజకీయ కేంద్రాలుగా మార్చారని అన్నారు. మిగిలిన ధాన్యం, ఇంకా కొనుగోలు కాని మొక్కజొన్నను వెంటనే కొనుగోలు చేసి రైతులకు ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు సలీం.. నేతలు తీరుపై చర్చ

**జమ్మికుంట టౌన్ మే 14 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహమ్మద్ సలీం (46) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆయన మృతితో ధర్మారం గ్రామంతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ నెల 4న హుజురాబాద్ మండలం పెద్ద పాపయ్యపల్లి గ్రామం నుండి తన స్వగ్రామమైన ధర్మారం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా రాజపల్లితోకలపల్లి గ్రామాల మధ్య హుజురాబాద్ హైవేపై వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సలీంను స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి వైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని అమృత న్యూరో కేర్ సెంటర్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో చివరకు ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. మహమ్మద్ సలీం కాంగ్రెస్ పార్టీలో దాదాపు 25 సంవత్సరాలుగా కొనసాగుతూ ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలో చురుకైన నాయకుడిగా సేవలందించారు. హుజురాబాద్ నియోజకవర్గంతో పాటు పలు ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ నాయకులతో సత్సంబంధాలు కలిగి ఉండేవారు. రాజకీయ ప్రస్థానంలో ఇతర పార్టీల వైపు చూడకుండా కాంగ్రెస్ పార్టీలోనే నిబద్ధతతో కొనసాగిన నాయకుడిగా గుర్తింపు పొందారు. అయితే ప్రమాదం జరిగిన నాటి నుండి చికిత్స పొందుతున్న సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏ ఒక్క అగ్ర నాయకుడు కూడా సలీంను పరామర్శించకపోవడం పట్ల స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సలీం ఆరోగ్య పరిస్థితిని అతని సన్నిహితులు, స్నేహితులు మాత్రమే తెలుసుకుంటూ అండగా నిలిచారని చెబుతున్నారు. ఈ ఘటనపై జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, హుజురాబాద్, కమలాపూర్ మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అగ్ర నాయకుల తీరుపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో కార్యకర్తలకు ఇలాంటి పరిస్థితులు ఎదురైతే పార్టీ నాయకత్వం అండగా నిలుస్తుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



# గ్రేహౌండ్స్ దళంపై డీజీపీ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలని నిర్ణయించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా దళాన్ని రీస్ట్రక్చరింగ్ చేయడం వల్ల పోలీస్ యంత్రాంగంపై భారం తగ్గడమే కాకుండా పనితీరు మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డీజీపీ పర్యటనలో భాగంగా గ్రేహౌండ్స్ విభాగంలోని వివిధ విభాగాలను ఆయన స్వయంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జవాన్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర రక్షణలో గ్రేహౌండ్స్ పోషించిన పాత్ర మరువలేనిదని, భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యాలయంలోని అత్యాధునిక ఆయుధ సంపత్తిని మరియు కమ్యూనికేషన్ వ్యవస్థను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం గ్రేహౌండ్స్ దళానికి అన్ని విధాలా అండగా ఉంటుందని డీజీపీ భరోసా ఇచ్చారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి దళం నిరంతరం సిద్ధంగా ఉండాలని సూచించారు. బలగాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా అనుభవజ్ఞులైన అధికారుల సలహాలను పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించారు. ఈ సమీక్షా సమావేశం గ్రేహౌండ్స్ దళం యొక్క భవిష్యత్తు గమనాన్ని నిర్దేశించడంలో కీలక పాత్ర పోషించనుంది.

# నీట్ పరీక్ష రద్దుపై సీఎం రేవంత్ ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు నీట్ కోసం ఎంతో కష్టపడి, ఆర్థిక భారం భరిస్తూ సిద్ధమవుతున్నారని సీఎం గుర్తుచేశారు. కుటుంబాల ఆశలు, విద్యార్థుల శ్రమను ఇలాంటి ఘటనలు దెబ్బతీస్తున్నాయని తెలిపారు. పోటీ పరీక్షలు యువతకు అవకాశాల ద్వారంగా ఉండాలే తప్ప ఆందోళనకు కారణం కాకూడదని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు అండగా నిలుస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన భద్రతా వ్యవస్థలు, సాంకేతిక రక్షణ చర్యలు, సంస్థాగత బాధ్యతలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసాన్ని నిలబెట్టడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

# సింగరేణికి పూర్వవైభవం తెస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పనిచేయాలని ఆయన కోరారు. మాజీ కేంద్ర మంత్రి కాకా వెంకటస్వామి సింగరేణి కోసం చేసిన కృషిని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసుకున్నారు. గతంలో ఆయన సింగరేణికి 400 కోట్ల రూపాయల నిధులు తీసుకురావడంతో పాటు లక్ష మంది ఉద్యోగాలను కాపాడారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలకు అనుగుణంగా బొగ్గు బ్లాకుల టెండర్లలో సింగరేణి పాల్గొనేలా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పీఆర్సీల పై ఆదాయపు పన్ను అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, రిటైర్డ్ కార్మికులకు 10 వేల రూపాయల పెన్షన్ వచ్చేలా ఎంపీ వంశీకృష్ణ పార్లమెంట్‌లో ప్రయత్నాలు చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. కొత్త గనుల ప్రారంభం ద్వారా సుమారు 5 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆర్కేపీ ఓపెన్‌కాస్ట్ ఫేజ్ 2 ప్రాజెక్టు ద్వారా పెద్ద ఎత్తున నిరుద్యోగులకు మేలు జరుగుతుందని, అటవీ శాఖ అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాల పెంపు అంశాన్ని కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో త్వరలోనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సింగరేణి కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, కార్మికులకు అండగా ఉంటామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ, కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. శ్రమశక్తి అవార్డు గ్రహీతలు పవన్ కుమార్, పుల్లూరి లక్ష్మణ్‌లను మంత్రి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం కార్మికులతో కలిసి మంత్రి రక్షణ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. సింగరేణి సంస్థను లాభాల బాటలో నడిపిస్తూనే కార్మికుల ప్రయోజనాలను కాపాడతామని మంత్రి పునరుద్ఘాటించారు. సంస్థ ప్రగతిలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమని, వారి కష్టానికి తగిన గుర్తింపు ఇస్తామని వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

# ఇంధన పొదుపుపై గవర్నర్ పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. అనవసర ప్రయాణాలను తగ్గించడం, వనరులను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇవ్వవచ్చన్నారు. బాధ్యతాయుత పాలనకు ఇలాంటి చర్యలు దోహదపడతాయని తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ పరిస్థితుల్లో ఇంధన సంరక్షణ అత్యంత అవసరమని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు, పౌరులు కలిసి పనిచేస్తే రాష్ట్రవ్యాప్తంగా మంచి సందేశం వెళ్తుందని అన్నారు. ఇంధన పొదుపు, బాధ్యతాయుత వినియోగం ద్వారా దేశ ప్రయోజనాలను కాపాడుకోవచ్చని సూచించారు.

# ప్రతిపక్షాల దొంగ మాటలు నమ్మొద్దు

(మొదటి పేజీ తరువాయి)

బుద్ధి చెప్పినా ప్రతిపక్షాలకు ఇంకా మార్పు రాలేదని మంత్రి వ్యాఖ్యానించారు. కుట్రలు, కుతంత్రాలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారని, అభివృద్ధి చేసే ప్రభుత్వానికే మద్దతు ఇస్తారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని పొంగులేటి స్పష్టం చేశారు. ఇప్పటికే 73 వేల ఉద్యోగాలు కల్పించామని, నిరుద్యోగులకు త్వరలోనే మరిన్ని శుభవార్తలు అందిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను కాగితాలకే పరిమితం చేసిందని, కానీ ప్రస్తుతం ఒక్క రూపాయి అవినీతి లేకుండా రూ.5 లక్షల ఆర్థిక సాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర, అదనపు కలెక్టర్ శ్రీజ, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, చైర్మన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నాయకులు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# ధాన్యం, మొక్కజొన్నను పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలి




- తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీని నియంత్రించాలి.
- మొక్కజొన్నల కొనుగోళ్లలో నిబంధనలు ఎత్తివేయాలి
- రైతు సంఘం నేత బాగం
- సిపిఐ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన, మంత్రికి వినతి

**ఖమ్మం బ్యూరో, మే 14(తెలంగాణ ముచ్చట్లు ):** ధాన్యం, మొక్కజొన్నను తాత్సరం చేయకుండా పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని కొనుగోలులో ఇబ్బందులను తొలగించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. రోజుల తరబడి కల్లాల వద్ద రైతులు పడిగాపులు కాసిన కొనుగోలు చేసే పరిస్థితి లేదని రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు పిలుపునిచ్చారు. ధాన్యం, మొక్కజొన్నల కొనుగోళ్లపై మంత్రులు సమీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో రైతు సంఘం ఆందోళనకు పిలుపునిచ్చింది. దీనితో పోలీసులు కలెక్టరేట్ వద్ద ఆందోళనకు అనుమతి ఇవ్వకపోగా పలువురు రైతు సంఘం నాయకులను ముందస్తు అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. పెద్ద సంఖ్యలో రైతులు కలెక్టరేట్ సమీపంలోకి చేరుకుని కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనను ఉద్దేశించి హేమంతరావు మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో నిల్వ చేయడానికి అవకాశం లేకుండాపోయిందని దీనితో పాటే గోనె సంచులు, ఇతరత్రా సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా గోడౌన్లను ఎంపిక చేసి సిద్ధం చేయడంలో వైఫల్యం కారణంగానే రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించారని వారి ద్వారా కొంత మేర మొక్కజొన్నలు విక్రయించారని మిగిలింది కొనుగోలు చేయడానికి సైతం ప్రభుత్వం సంసిద్ధంగా లేకపోవడం విచారకరమని హేమంతరావు తెలిపారు. ఎకరాకు మొక్కజొన్నల కొనుగోలు విషయంలో 26 క్వింటాళ్ల నిబంధనను తక్షణం ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. మొక్కజొన్నలు కొనుగోలు చేసి రెండు మాసాలు గడిచినా ఇంత వరకు రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదని వెంటనే జమ చేయాలని అధికారులను కోరారు. మార్క్ఫెడ్ను రంగంలోకి దించి కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. ధాన్యం ఎగుమతి విషయంలో లారీల యజమానులు రైతులను ఇబ్బందులు పెడుతూ ఒక్కో బస్తాకు రూ. 20 నుంచి రూ.80ల వరకు వసూలు చేస్తున్నారని తక్షణం అదనపు వసూళ్లను నిలిపివేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. మిల్లర్లు రైతులను దోపిడీ చేస్తున్నారని కోతల పేరుతో జరుగుతున్న మోసాలను అరికట్టాలని హేమంతరావు డిమాండ్ చేశారు. ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. అంతకు ముందు రైతు సంఘం నేతలు బాగం హేమంతరావు, గోవిందరావు తదితరులను పోలీసులు అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సిపిఐ, రైతు సంఘాల నేతలు జమ్ముల జితేందర్రెడ్డి, ఎస్ కె జానిమియా, ఏపూరి రవీంద్రబాబు, పగడాల మల్లేష్, పావులూరి మల్లిఖార్జున్, కూచిపూడి రవి, ఏనుగు గాంధీ, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పుచ్చకాయల సుధాకర్, వరదా నర్సింహారావు, దొబ్బల వెంగళరావు, బాగం మాధవరావు, నానబాల రామకృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధి

- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు..
- రామన్నపేట క్లస్టర్ ప్రజా దర్బార్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం బ్యూరో, మే 14(తెలంగాణ ముచ్చట్లు):** పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక అయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం నుంచి.. ఆడబిడ్డల ఉచిత ప్రయాణం వరకు ప్రతి హామీని నెరవేరుస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం కార్పొరేషన్ 1, 59, 60 డివిజన్ల ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం రామన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించి మాట్లాడారు.

అర్హతే ప్రామాణికం.. అండగా ప్రభుత్వం

ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుని మూడవ ఏట అడుగుపెట్టిన సందర్భంగా 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో పేదవాడి సొంతింటి కల కలగానే మిగిలిపోయిందని, తమ ప్రభుత్వం వచ్చిన మొదటి ఏడాదే 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని ఆయన గుర్తు చేశారు. కేవలం మంజూరు చేయడమే కాకుండా, ప్రతి సోమవారం పనుల పురోగతిని బట్టి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని వివరించారు. భూ సమస్యల పరిష్కారం కోసం 'భూభారతి' చట్టం ద్వారా ధరణి కష్టాలను తొలగిస్తున్నామని పేర్కొన్నారు.

సమస్యలకు పరిష్కార వేదిక ప్రజా దర్బార్

నియోజకవర్గ వ్యాప్తంగా 14 క్లస్టర్లుగా విభజించి ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇది 13వ క్లస్టర్ అని మంత్రి తెలిపారు. చిన్న చిన్న సమస్యలను వేదికపైనే పరిష్కరించేలా అధికారులను ఆదేశించడమే కాకుండా వారం రోజుల్లో పరిష్కరించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మూడు నెలల లోపు ప్రతి న్యాయమైన అర్జీని పరిష్కరించి తీరుతామని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం పరిపాలనకు సంబంధించి ప్రతి శాఖను విశ్లేషించి, ప్రజలకు మేలు చేయడమే ఈ 99 రోజుల కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు.

అభివృద్ధి చూపించి మళ్లీ ఓట్లు అడుగుతా

రెండు ఏళ్ల క్రితం ఈ డివిజన్లలో రోడ్లు, కరెంటు, తాగునీటి పరిస్థితి ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో ప్రజలే ఆలోచించాలని మంత్రి అన్నారు. ఇంకా కొన్ని రోడ్లు వేయాల్సి ఉందని, ఆ పనులు కూడా పూర్తి చేశాకే మళ్లీ ప్రజల ముందుకు వచ్చి ఓట్లు అడుగుతానని ఆయన స్పష్టం చేశారు. మాటలు చెప్పడం కాదు.. పని చేసి చూపించడమే తన నైజమని ఉద్ఘాటించారు.

సంక్షేమ పథకాలపై మాట్లాడుతూ...

200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీతో పాటు ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం వంటి పథకాలు పేద ఇంటి గుమ్మానికి చేరుతున్నాయని మంత్రి తెలిపారు. విద్యార్థుల కోసం డైట్ చార్జీలను 40 శాతం, ఆడపిల్లల కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. ఆసరా పెన్షన్లు మంజూరు చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని, ఇప్పుడు అర్హులైన వితంతువులు, వయోవృద్ధుల సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ, అడిషనల్ డీసీపీ రామానుజం, వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ అధికారులు, ఆయా డివిజన్ల మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లోకి వలసలు

- మునిగేపల్లి సర్పంచ్, ఐదుగురు వార్డు సభ్యుల చేరిక



**ఖమ్మం బ్యూరో, మే 14(తెలంగాణ ముచ్చట్లు ):** పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలంలో అధికార పార్టీలోకి వలసలు ఊపందుకున్నాయి. మునిగేపల్లి సర్పంచ్ గంగా స్రవంతి తన అనుచర వర్గంతో కలిసి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖమ్మంలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐదు నెలల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి సర్పంచ్‌గా గెలుపొందిన గంగా స్రవంతి, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. సర్పంచ్‌తో పాటు ఆమె వెన్నంటి గెలిచిన ఐదుగురు వార్డు సభ్యులు, గ్రామ ముఖ్య నాయకులు, వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు మంత్రి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# జుపాకలో జయశంకర్ బడిబాట సందడి..

- ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రుల ఆకర్షణకు ప్రత్యేక ర్యాలీ




**హుజురాబాద్, మే 14(తెలంగాణ ముచ్చట్లు ):** విద్యా వారోత్సవాల సందర్భంగా జుపాక గ్రామంలో గురువారం నిర్వహించిన "ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట" కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర స్వామి నాయకత్వంలో గ్రామ వీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మెరుగైన సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని "ప్రభుత్వ బడి - మన బడి", "నాణ్యమైన విద్యకు ప్రభుత్వ పాఠశాలలే ఆదర్శం" వంటి నినాదాలతో గ్రామస్తులను ఆకట్టుకున్నారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర స్వామి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు ఆధునిక బోధనా విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్య వంటి సౌకర్యాలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు.

ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందుతున్నదని పేర్కొంటూ, ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# డిజిటల్ విద్యతో ప్రభుత్వ బడిలో నూతన అధ్యాయం




**ఎల్కతుర్తి, మే 14 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ విద్యా వారోత్సవాల సందర్భంగా దండేపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో గురువారం బడిబాట ర్యాలీతో పాటు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గొలిపెల్లి సంపత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. రమేష్ బాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొలిపెల్లి సంపత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం డిజిటల్ విద్యకు ప్రాధాన్యత పెరిగిందని తెలిపారు. ఇంటరాక్టీవ్ ఫ్లాట్ పానల్స్ ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన జరుగుతోందని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ బడుల్లోనూ ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఇదే పాఠశాలలో చదివి ఉపాధ్యాయులు, డాక్టర్లు, ఇంజినీర్లు, పోలీసులు వంటి ఉన్నత స్థాయిలో స్థిరపడిన వారు ఎంతోమంది ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అనేక ఉచిత సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించి విద్యార్థుల చేర్పుపై అవగాహన కల్పించారు.

# మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆర్థిక చేయూత



**పెద్దమందడి,మే14(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి గ్రామంలో అనారోగ్య కారణాలతో వడ్డే పెద్ద బాలస్వామి, బర్ల మల్లయ్య మృతి చెందడంతో కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం కార్యకర్తలతో కలిసి గురువారం వారి కుటుంబాలను పరామర్శించారు.ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తరఫున మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ తక్షణ సహాయంగా ఒక్కో కుటుంబానికి రూ.5000/ వేల ఆర్థిక సహాయం అందజేశారు.బాధిత కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని నాయకులు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధిర శ్రీశైలం, ఉప సర్పంచ్ రాములమ్మ హనుమంతు, వార్డు సభ్యులు కొంకలి నరేష్, కావలి కృష్ణ, నాయకులు కొంకల్లి నరసింహ, లక్ష్మారెడ్డి, సిద్ధు, చందు, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

# 110 ఏళ్ల వృద్ధుడి మృతి..



**హుజురాబాద్, మే 14(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం జూపాక గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు పూడుడు పూదరి రాజయ్య (110) వృద్ధాప్యంతో గురువారం మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రాజయ్యకు సుమారు 70 మంది మనుమలు, మనుమరాళ్లు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గ్రామంలో పెద్దవారిగా గుర్తింపు పొందిన రాజయ్య మృతి పట్ల గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి పలువురు గ్రామస్థులు సంతాపం తెలిపారు.

# మద్దిగట్ల - మోజర్ల లో బడిబాట కార్యక్రమం

- తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన





**పెద్దమందడి,మే14(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మద్దిగట్ల-మోజర్లలో గురువారం బడిబాట కార్యక్రమం, తల్లిదండ్రుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ముందుగా మద్దిగట్ల, మోజర్ల గ్రామాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులతో కలిసి బడిబాట ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మద్దిగట్ల సర్పంచ్ రాములు యాదవ్, మోజర్ల సర్పంచ్ చంద్రశేఖర్, ఉప సర్పంచ్ రవి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.అనంతరం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాద్ రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు.విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, 21 రకాల వస్తువులతో కూడిన కిట్ వంటి సదుపాయాలు అందిస్తున్నట్లు తెలిపారు. గత రెండేళ్లుగా పాఠశాలలో పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించామని, డిజిటల్ తరగతుల ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లించి ఆర్థిక ఇబ్బందులు పడకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. వెంకటస్వామి, గద్వాల కృష్ణయ్య, ఎం. పుల్లయ్య, కే. మధుసూదన్, ఎన్. వెంకటస్వామి, ఏ. వెంకటస్వామి, చిన్నారెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## బతుకు భారమై... జీవితం అవిటిదై వరద బాధితుడికి అందని సహాయం...

◆ ప్రభుత్వ ఆదరణ కోసం ఎదురుచూపులు



**ఖమ్మం బ్యూరో, మే 14(తెలంగాణ ముచ్చట్లు):** చింతకాని మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గుర్రం నాగేశ్వర రావు (40) కుటుంబానికి జరిగిన విషాదం మాటల్లో చెప్పలేనిది. 2024లో వచ్చిన తుపాను కారణంగా చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు ఉప్పొంగి మున్నేరు వరద భీభత్సాన్ని సృష్టించాయి. ఆ వరదల వల్ల ఎన్నో కుటుంబాలు తీవ్ర నష్టాన్ని చవి చూశాయి. ఆ బాధితుల్లో నాగేశ్వరరావు కుటుంబం ఒకటి. వరద తగ్గిందని భావించి భార్య వసంతతో కలిసి బయలుదేరిన నాగేశ్వరరావు, ఖమ్మం-దంసలాపురం ఫ్లైఓవర్ సమీపానికి చేరుకోగానే బురద కారణంగా ద్విచక్ర వాహనం జారి ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో భార్య వసంత తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. అదే సమయంలో నాగేశ్వరరావుకు కుడిచేయి విరిగింది. కుటుంబ సభ్యులు ఆయనకు చికిత్స అందించేందుకు ఎంతో ప్రయత్నించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లో ఆపరేషన్ చేయించినప్పటికీ చేయి పూర్తిగా పనిచేయకుండా పోయింది. దీంతో నాగేశ్వరరావు వికలాంగుడిగా మారి, ప్రస్తుతం ఒక్క చేత్తోనే తన పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్యను కోల్పోయి, ఇద్దరు కుమారుల బాధ్యతలను మోస్తున్న నాగేశ్వరరావు, శారీరక వైకల్యం కారణంగా ఎలాంటి పనులుచేసుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ప్రమాదం జరిగి దాదాపు ఒక సంవత్సరం ఎనిమిది నెలలు గడిచినా ప్రభుత్వం ద్వారా రావాల్సిన శ్రీనిధి ఇన్సూరెన్స్ ఇప్పటికీ అందలేదు. ఇక వికలాంగుల పెన్షన్ కోసం చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. కుడిచేయి పూర్తిగా పనికిరాకపోయినా, వైద్యులు 40 శాతం వికలాంగత్వమే ఉందని ధృవీకరణ పత్రం ఇవ్వడంతో ఆయనకు వికలాంగుల పెన్షన్ మంజూరు కాలేదు. కష్టపడి బతికే జీవితాన్ని ఒక్క ప్రమాదం ఛిద్రము చేసింది. భార్యను కోల్పోయి, శారీరక వైకల్యంతో జీవితం భారంగా మారిన నాగేశ్వరరావును ప్రభుత్వం, అధికారులు తక్షణమే ఆదుకుని న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## జమ్మికుంట మార్కెట్ యార్డు మక్కల కొనుగోలుకు తాత్కాలిక బ్రేక్

◆ రైతులు సహకరించాలని మార్కెట్ చైర్మన్ విజ్ఞప్తి




**జమ్మికుంట టౌన్ మే 14 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతులకు అత్యంత కీలక ప్రకటన విడుదల చేసింది. జమ్మికుంట పత్తి మార్కెట్ యార్డులో భారీ స్థాయిలో మక్కల నిల్వలు పేరుకుపోవడంతో యార్డు పూర్తిగా నిండిపోయిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యగా మే 15, 2026 శుక్రవారం నుంచి తదుపరి ప్రకటన వెలువడే వరకు మక్కలను మార్కెట్ యార్డుకు తీసుకురావద్దని మార్కెట్ కమిటీ స్పష్టం చేసింది. గత కొన్ని రోజులుగా పరిసర గ్రామాల నుంచి వేలాది క్వింటాళ్ల మక్కలు మార్కెట్ యార్డుకు తరలివస్తుండటంతో నిల్వ స్థలం తీవ్ర కొరత ఏర్పడింది. దీంతో ట్రాక్టర్లు, లారీలు యార్డులోనే భారీగా నిలిచిపోవడంతో పాటు రైతులు కూడా గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సరుకు తూకం, నిల్వ, వేలంపాటల ప్రక్రియ ఆలస్యమవుతుండటంతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మార్కెట్ యార్డులో ఇప్పటికే నిల్వ ఉన్న మక్కలను త్వరితగతిన క్లియరెన్స్ చేసి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం మళ్లీ మక్కల రాకపై కొత్త తేదీ ప్రకటిస్తామని తెలిపారు. అప్పటి వరకు రైతులు తమ పంటను గ్రామాల వద్దనే భద్రపరుచుకోవాలని సూచించారు. రైతులు ఎలాంటి అపోహలకు గురికాకుండా అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని మార్కెట్ కమిటీ కోరింది. అనుమతి లేకుండా మక్కలను యార్డుకు తీసుకువస్తే రవాణా ఖర్చులు, వేచి ఉండే పరిస్థితులు, అనవసర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ రైతుల సహకారం మార్కెట్ నిర్వహణలో ఎంతో కీలకమని పేర్కొన్నారు. యార్డులో పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చిన వెంటనే మళ్లీ కొనుగోళ్లు ప్రారంభిస్తామని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కావున సమస్త మక్కల రైతులు ఈ ప్రకటనను గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజాప్రతినిధుల పిలుపు

**ఎల్కతుర్తి , మే 14( తెలంగాణ ముచ్చట్లు-):** "ప్రైవేట్ స్కూల్ వద్దు... గవర్నమెంట్ స్కూల్ ముద్దు" అనే నినాదంతో గోపాలపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల చేరికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, ఇంగ్లీష్ మీడియం బోధన, డిజిటల్ తరగతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాల గురించి వివరించారు. మన గ్రామ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలపూర్ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రప్రకాశ్ గారు, పాఠశాల విద్యా అభివృద్ధి కమిటీ చైర్మన్ కంచర్ల శారద గారు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోపాలపూర్ ప్రధానోపాధ్యాయుడు కిషన్ రావు గారు, పాఠశాల విద్యా అభివృద్ధి కమిటీ చైర్మన్ సులోచన గారు, గోపాలపూర్ బస్టాండ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సదానందం గారు, పాఠశాల విద్యా అభివృద్ధి కమిటీ చైర్మన్ అనూష గారు పాల్గొన్నారు. అలాగే గ్రామ సర్పంచ్ కర్రే లక్ష్మి గారు, ఉపసర్పంచ్ మరుపాక సందీప్ గారు, వార్డు సభ్యులు శ్రీపతి లావణ్య, రజిత, సంబరాజు స్వప్న, మనోజ్, శివ, సంధ్యారాణి, చరణ్, భాస్కర్ తదితరులు పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

◆ మంత్రి పొంగులేటితో కలిసి ధాన్యం కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి ఉత్తమ్



**ఖమ్మం బ్యూరో, మే 14(తెలంగాణ ముచ్చట్లు ):** రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం పాలేరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో రూ. 22 వేల కోట్లతో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడమే లక్ష్యమని వెల్లడించారు. హమాలీల కొరత ఉన్నప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని, వచ్చే 15 రోజుల పాటు లారీలను కేవలం ధాన్యం రవాణాకే కేటాయించినట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, సీపీ సునీల్ దత్ తదితరులు పాల్గొన్నారు.

## లారీలు లేక మూడు వేల బస్తాలు నిల్వ.!

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబూరావు.



**దమ్మపేట, మే 14(తెలంగాణ ముచ్చట్లు):** మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబూరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ధాన్యం శుభ్రపరిచే విధానం, తూకాల నిర్వహణపై రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే కేంద్ర నిర్వాహకుడు పోలారావుతో మాట్లాడి ధాన్యం నిల్వలు, రవాణా పరిస్థితులపై ఆరా తీశారు. గత రెండు రోజులుగా లారీలు అందుబాటులో లేకపోవడంతో సుమారు మూడు వేల ధాన్య బస్తాలు కేంద్రంలోనే నిల్వ ఉండిపోయాయని నిర్వాహకుడు వివరించారు. దీనిపై స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారి జిల్లా పౌర సరఫరాల అధికారితో ఫోన్‌లో మాట్లాడి వెంటనే మూడు లారీలు పంపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీలో అశ్వారావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి. రవి కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి ఆరేపల్లి సతీష్, కేంద్ర నిర్వాహకుడు పోలారావు, రైతులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడిన ప్రజానాట్యమండలి చరిత్ర గొప్పది



**ఎల్కతుర్తి, మే 14( తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఎల్కతుర్తి మండల కేంద్రంలో గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మండల కార్యదర్శి శనిగరపు రాజ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరు రాములు, కర్రే లక్ష్మణ్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజనర్సు పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాడిన ప్రజానాట్యమండలి చరిత్ర ఎంతో గొప్పదని వక్తలు పేర్కొన్నారు. 1943లో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఐపిటిఏ) స్థాపనతో ప్రజా చైతన్యానికి శ్రీకారం చుట్టిన ప్రజానాట్యమండలి, పాటలు, నాటకాలు, బుర్రకథలు, యక్షగానాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించిందన్నారు. తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో ప్రజానాట్యమండలి కీలక పాత్ర పోషించిందని తెలిపారు. "మా భూమి", "ముందడుగు" వంటి నాటకాలు ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపాయని, జానపద కళారూపాల ద్వారా సామాజిక సమస్యలను ప్రజల ముందుకు తీసుకువచ్చిందన్నారు. బుర్రకథ, డప్పు, కోలాటం వంటి కళారూపాలను పరిరక్షిస్తూ ప్రజానాట్యమండలి సమాజ చైతన్యానికి కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల సమస్యలపై కళారూపాలతో చైతన్యం కల్పిస్తూ ప్రజానాట్యమండలి తన కార్యక్రమాలను కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తండా మొండయ్య, వేముల కృష్ణకర్, బిల్కూరు తులసిరామ్, ఎర్ర ప్రకాష్, రాజం రాజు, ఎండీ రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను చైతన్యపరిచిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు



**ఎల్కతుర్తి, మే 14 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం, విద్యా వారోత్సవాల్లో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని ఎల్కతుర్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని బావుపేట, తిమ్మాపూర్, ఎల్కతుర్తి, దామెర గ్రామాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి బడి బాట ర్యాలీలు నిర్వహిస్తూ ప్రభుత్వ విద్య ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన బోధన గురించి అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారి తప్పనిసరిగా విద్యను అభ్యసించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ బోధనతో పాటు డిజిటల్ తరగతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సర్పంచ్ బత్తిని రవీందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భవిష్యత్తుకు అనుగుణంగా మెరుగైన విద్య అందిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో చదువుకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బావుపేట పాఠశాల సముదాయం ప్రధానోపాధ్యాయులు ఎల్. మనోహర్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడానికి తల్లిదండ్రుల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరయ్య చారి, శ్రీధర్, సునీత, మర్రి రవికుమార్, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్, కారోబార్ మొగిలయ్య, గ్రామ ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్ తో కలిసి ధాన్యం కొనుగోళ్లపై పొంగులేటి సమీక్ష



**ఖమ్మం బ్యూరో, మే 14(తెలంగాణ ముచ్చట్లు):** రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం ఖమ్మం ఐడిఓసిలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన ఉమ్మడి జిల్లా ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రైతులకు అండగా ఉండాలనే లక్ష్యంతో మద్దతు ధరకు అదనంగా రూ. 500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తాలు, తరుగు పేరిట రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా కోతలు విధిస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేస్తూనే, రైతులెవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ధాన్యంతో పాటు మొక్కజొన్నను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆయన వివరించారు. ఈ సమావేశంలో కలెక్టర్లు దివాకర టి.ఎస్, అంకిత్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, రాందాస్ నాయక్ , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులను తొలగించండి

### మంత్రి ఉత్తమ్‌కు సిపిఐ వినతి



**ఖమ్మం బ్యూరో, మే 14(తెలంగాణ ముచ్చట్లు):** ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించి త్వరితగతిన కొనుగోలు చేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో మంత్రి ఉత్తమ్కుమార్‌రెడ్డి వినతి పత్రం సమర్పించారు. గురువారం ధాన్యం కొనుగోలుపై సమీక్షకు ఖమ్మం కలెక్టరేట్కు వచ్చిన సందర్భంగా శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, బాగం హేమంతరావు నేతృత్వంలో వినతి పత్రం సమర్పించారు. ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. గోనె సంచుల కొరత, కాంటాల్లో జాప్యం రైతులకు శాపంగా మారిందని మంత్రికి వివరించారు. మిల్లర్లు తరుగు పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నారని క్వింటాకు ఐదు నుంచి 11కేజీల వరకు కోత విధిస్తున్నారని దీనిని తక్షణం నిరోధించాలని మంత్రిని కోరారు. మొక్కజొన్నల కొనుగోలులో సైతం ఇబ్బందులను అధిగమించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు తీవ్ర జాప్యం జరుగుతుందని నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, ఎస్కె జానిమియా, ఏపూరి రవీంద్రబాబు, కూచిపూడి రవి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పుచ్చకాయల సుధాకర్, దొబ్బల వెంగళరావు, మల్లికార్జున్, వరదా నర్సింహారావు, గోపాలరావు, తదితరులు ఉన్నారు.




తెలంగాణ మలిదశ ఉద్యమ గర్జనలైనా, ఆంధ్రుల హక్కుల కోసం సాగిన వీరోచిత పోరాటాలైనా, బాబాసాహెబ్ అంబేద్కర్ రగిలించిన సామాజిక విప్లవ జ్వాలలైనా, లేదా భగత్ సింగ్ చిరునవ్వుతో ముద్దాడిన ఉరికంబం సాక్ష్యమైనా ఆ ప్రతి చరిత్రా సిరాతో కాదు, వీరుల నెత్తురుతో రాయబడింది. ఎండనక, వాననక గొంతెండిన నినాదాలతో, కడుపులో కకపికలాడే ఆకలి మంటలతో, కన్నతల్లిదండ్రులను, కట్టుకున్న భార్యాపిల్లలను వదిలి వీధుల్లోకి వచ్చిన ఆ యువకిశోరాల కన్నీళ్లతో ఈ చరిత్ర మలచబడింది.ఒక్కసారి గుండె మీద చేయి వేసుకుని ఆలోచించండి. ప్రాణాన్ని పణంగా పెట్టిన ఆ వేదనకు మనం ఏ కరెన్సీ నోట్లతో విలువ కట్టగలం? నేల రాలిన ఆ రక్తపు చుక్కలకు ఏ బ్యాంకు ఖాతాల్లోని అంకెలు సరితూగుతాయి? ఆ బాధకు, ఆ ఆవేదనకు వెల కట్టాలనుకోవడం అంటే సూర్యుడికి దీపం చూపించడమే కాదు, ఆ వీరుల ఆత్మగౌరవాన్ని బజారున పెట్టడమే!నేటి రాజకీయ చదరంగం చూస్తుంటే ఒక భయానక వాస్తవం కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది. ఎన్నికల నగారా మోగగానే, మా పార్టీయే మీ కోసమే పోరాడింది ,మేమే ఈ గడ్డకు విముక్తి ప్రసాదించాం అంటూ గొంతు చించుకునే నేతలు ఎందరో! కానీ, ఆ పోరాట యోధులను వారు కేవలం తమ ప్రచారపు హోర్డింగులకు, పార్టీ జెండాలకు అలంకార ప్రాయంగా మాత్రమే వాడుకుంటున్నారు. శాసనసభ వేదికల మీద నిలబడి మా ఉద్యమ గతం అని రొమ్ము చరుచుకుని ఉపన్యాసాలు దంచే నాయకులు, తీరా అధికారం చేతికి వచ్చాక ఆ ఉద్యమకారుల కుటుంబాలను కన్నెత్తి కూడా చూడటం లేదు. ఉదాహరణకు, తెలంగాణ రాష్ట్రం కోసం అమరులైన వేయికి పైగా నిండు ప్రాణాలను తీసుకోండి. వారి త్యాగాల పునాదుల మీద నేడు అధికార సౌధాలు వెలిశాయి. కానీ, ఆ అమరుల కుటుంబాలు నేటికీ ఒక చిన్న పరిహారం కోసమో, లేదా గుర్తింపు కోసమో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్ళరిగేలా తిరుగుతున్నాయి. ఆ నిరుపేద తల్లుల కళ్లలో కారుతున్న కన్నీటి విలువ అర్థమయ్యే సున్నితత్వం ఏ నేతకైనా ఉందా? విచారకరమైన విషయం ఏమిటంటే, పోరాటం జరుగుతున్నప్పుడు ఎక్కడో ఏసీ గదుల్లో దాక్కున్న కొందరు, నేడు అదే చరిత్రను అడ్డం పెట్టుకుని కోట్లాది రూపాయల ఆస్తులు కూడబెట్టారు. రక్తంతో రాసిన పవిత్ర చరిత్రను తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం నోట్ల కట్టలు గా మార్చుకున్నారు. ఇది అక్షరాలా చరిత్రకు చేస్తున్న పరమ ద్రోహం!

> "రక్తంతో రాసిన పవిత్ర చరిత్రను తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం నోట్ల కట్టలుగా మార్చుకున్నారు. పోరాట చరిత్రను కేవలం అధికారం చేజిక్కించుకోవడానికి నిచ్చెనలా వాడుకున్న నేతలే, ఆ నిచ్చెన మెట్లలాంటి ఉద్యమకారులను విస్మరించడం నేటి రాజకీయ వైచిత్రి. అమరుల ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే మనం వారికిచ్చే నిజమైన నివాళి; లేకపోతే, రాబోయే కాలం మనల్ని 'చరిత్ర ద్రోహుల' జాబితాలో చేరుస్తుంది."

మనం ఒకసారి ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళ్తే 1969లో జరిగిన ఉద్యమ తీవ్రతను గుర్తు చేసుకోక తప్పదు. అప్పుడు వీధుల్లోకి వచ్చింది ఏ రాజకీయ స్వార్థం లేని విద్యార్థులు. పుస్తకాలు పట్టుకోవాల్సిన ఆ చేతులు జెండాలు పట్టాయి. క్లాస్ రూమ్ గోడల మధ్య ఉండాల్సిన ఆ గొంతులు హక్కుల కోసం గర్జించాయి. పోలీసుల తుపాకీ బుల్లెట్లకు ఎదురు నిలిచారు, లాఠీ దెబ్బలకు వెన్ను చూపలేదు. జైలు గోడలు వారిని భయపెట్టలేకపోయాయి. కేవలం తమ ప్రాంత భవిష్యత్తు బాగుండాలనే ఒకే ఒక్క నిష్కల్మషమైన ఆశయంతో వారు ప్రాణాలు అర్పించారు. కానీ నేడు ఆ ఉద్యమ స్ఫూర్తి ఏమైపోయింది? ఆ వీరుల పేర్లు కనీసం చరిత్ర పాఠ్యపుస్తకాల్లో అక్షర రూపం దాల్చాయా? వారి కుటుంబాలు నేడు సమాజంలో గౌరవంగా బతుకుతున్నాయా? ఈ ప్రశ్నలకు జవాబులు వెతకడం మొదలుపెడితే నిశ్శబ్దమే సమాధానంగా మిగులుతుంది. పోరాట చరిత్రను కేవలం అధికారం చేజిక్కించుకోవడానికి నిచ్చెనలా వాడుకున్న నేతలే, ఆ నిచ్చెన మెట్లలాంటి ఉద్యమకారులను విస్మరించడం నేటి రాజకీయ వైచిత్రి. నన్ను మీరు ఉరి తీయవచ్చు, కానీ నా విప్లవ ఆలోచనలను ఉరి తీయలేరు ఈ మాటలు అన్నది విప్లవ వీరుడు భగత్ సింగ్. ఆ మాటలు వింటే నేటికీ రక్తంలో వేడి పుడుతుంది. కానీ వాస్తవంలో ఆ ఆలోచనలు నేడు బతికే ఉన్నాయా? అని ప్రశ్నించుకుంటే గుండె తరుక్కుపోతుంది. నేడు భగత్ సింగ్ ఒక నినాదం కాదు, టీ షర్టుల మీద అమ్ముడయ్యే ఒక డిజైన్ అయిపోయాడు. బాబాసాహెబ్ అంబేద్కర్ బొమ్మలు కేవలం ఓట్ల రాజకీయాలకు, గోడ పత్రికలకే పరిమితం అవుతున్నాయి. మహాత్మా గాంధీ పేరును బ్రాండ్లుగా మార్చుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు.మహాత్ముల త్యాగాలను ఇలా వ్యాపారీకరించడం అంటే వారి ఆత్మలను అవమానించడమే. వారు ఏ లక్ష్యం కోసమైతే తమ జీవితాలను ధారపోశారో, ఆ లక్ష్యాలను గాలికొదిలేసి, వారి ప్రతిమలను మాత్రం పూజిస్తున్నాం. ఇది గౌరవం కాదు, గతాన్ని వెక్కిరించడం. వారు రక్తమోడ్చి రాసిన విలువల చరిత్రను, మనం నోట్లతో కొంటున్నామా లేదా అమ్ముతున్నామా అనే చర్చ జరగాల్సిన సమయం ఇది.

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కేవలం కొన్ని చట్టాలను రాసి ఊరుకోలేదు. ఆయన తన ప్రతి అడుగులోనూ అసమానతలకు వ్యతిరేకంగా యుద్ధం చేశారు. అణచివేతకు గురైన వర్గం నుంచి వచ్చి, ప్రపంచమే గర్వించే మేధావిగా ఎదగడం వెనుక ఉన్న ఆ సంఘర్షణ సామాన్యమైనది కాదు. అడుగడుగునా అవమానాలు, ప్రతి మాటా తిరస్కారపు గాయాలే! అయినా సరే, ఆయన మొక్కవోని దీక్షతో సామాజిక న్యాయం కోసం పోరాడారు.

కానీ నేటి సమాజంలో ఆ న్యాయం ఉందా? జాతీయ పండుగలు రాగానే అంబేద్కర్ విగ్రహాలకు పూలదండలు వేస్తాం, సోషల్ మీడియాలో గొప్పగా స్టేటస్‌లు పెడతాం. కానీ, మరుసటి క్షణం నుండి మళ్ళీ అదే కుల వివక్షలో కూరుకుపోతాం. అదే అసమానతలను ప్రోత్సహిస్తాం. అణగారిన వర్గాల పట్ల జరుగుతున్న అన్యాయాలను చూసీచూడనట్లు వదిలేస్తాం. ఇది చరిత్రకు మనం చేస్తున్న అపచారం కాదా? అమాయకుల త్యాగాలను మన వ్యక్తిగత సౌకర్యాల కోసం వాడుకోవడమేనా సామాజిక బాధ్యత?ఒకప్పుడు పత్రికలు సమాజానికి నిజమైన అద్దంలా ఉండేవి. జర్నలిస్టులు సత్యం కోసం, ప్రజల గొంతుకగా ఉండటం కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టేవారు. ఏ పాలకుడికీ తలొగ్గని నిబద్ధత వారిలో ఉండేది. కానీ నేడు పరిస్థితి తలకిందులైంది. చాలా మీడియా సంస్థలు ఇప్పుడు కేవలం వ్యాపార సంస్థలు గా మారిపోయాయి. ప్రకటనల ప్యాకేజీలు, టీఆర్పీ రేటింగ్లే వార్తల నాణ్యతను నిర్ణయిస్తున్నాయి. ప్రజల కన్నీటిని, నిస్సహాయుల పోరాటాలను కేవలం మూడు నిమిషాల బ్రేకింగ్ న్యూస్ కు పరిమితం చేసి, ఆ వెంటనే వ్యాపార ప్రకటనల్లోకి వెళ్ళిపోతున్నాయి. ఎందరో వీరుల రక్తంతో రాయబడిన పచ్చి నిజాలు నేడు దినపత్రికల్లో ఎక్కడో లోపలి పేజీల్లో మూలన పడిపోతున్నాయి. మొదటి పేజీ మాత్రం అంగరంగ వైభవంగా రాజకీయ ప్రచారాలకు, కార్పొరేట్ ప్రకటనలకు అంకితమవుతోంది. ఇది మీడియా ధర్మానికే ఒక మచ్చ. ఈ వ్యాసాన్ని చదువుతున్న యువతరానికి ఒక్కటే చెప్పాలి.మీ చేతుల్లోనే ఈ దేశ భవిష్యత్తు ఉంది. మీరు చూపిస్తున్న నిరాసక్తత దేశానికి పెద్ద శాపం. మీ పూర్వీకులు రక్తంతో రాసిన చరిత్రను, మీరు కేవలం నోట్లతో కొనే ఒక వస్తువుగా భావించకండి. ఆ చరిత్ర మీ వారసత్వ సంపద. ఆ సంపదను జేబులో దాచుకోవడానికి కాదు, ఆ స్ఫూర్తిని మీ రక్తంలో జీర్ణించుకోవడానికి!ఎన్నికల సమయంలో మాత్రమే దేశభక్తిని ప్రదర్శించడం కాదు, ప్రజాస్వామ్యాన్ని మీ దైనందిన జీవితంలో ఆచరించండి. ఎక్కడ అవినీతి కనిపించినా ఎదురు నిలవండి. ఎక్కడ అసమానత కనిపించినా గొంతు విప్పండి. మీ చుట్టూ జరుగుతున్న అన్యాయాన్ని చూసి మౌనంగా ఉండిపోవద్దు. ఎందుకంటే, ఆ మౌనం కూడా ఒక రకమైన నేరమే! ఆ మౌనమే త్యాగధనుల చరిత్రను అంగడి సరుకుగా మార్చేస్తోంది. చరిత్రను రక్తం ధారపోసి రాసిన వీరులు ఇప్పుడు మన మధ్య లేకపోవచ్చు. కానీ వారు వదిలి వెళ్ళిన ఆశయాలు సజీవంగానే ఉన్నాయి. ఆ పోరాట స్మృతులు ఒక జీవనదిలా ప్రవహిస్తూనే ఉన్నాయి. ఆ నిప్పులాంటి మాటలు గాలిలో కలిసి మనల్ని హెచ్చరిస్తూనే ఉన్నాయి. గుర్తుంచుకోండి. మన హృదయాల్లో నాటుకున్న ఆ త్యాగ విత్తనాలు ఏ కోటీశ్వరుడి నోట్ల కట్టలకూ అమ్ముడుపోవు.రక్తంతో రాసిన చరిత్రను నోట్లతో కొనాలనుకునే వారు తెలుసుకోవాల్సిన సత్యం ఒకటి ఉంది చరిత్ర ఎప్పుడూ బేరమాడదు , సత్యానికి ధర ఉండదు. త్యాగానికి రసీదులు ఉండవు. ఈ సమాజంలో నిజమైన మార్పు రావాలంటే, ఆ చరిత్రను కేవలం పుస్తకాల్లోనే కాదు, మన గుండెల్లో దాచుకోవాలి. అమరుల ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే మనం వారికిచ్చే నిజమైన నివాళి.లేకపోతే, రాబోయే కాలం మనల్ని చరిత్ర ద్రోహుల జాబితాలో చేరుస్తుంది. మన పిల్లలు రేపు మనల్ని ప్రశ్నిస్తారు చరిత్ర అమ్ముడుపోతుంటే మీరు ఏం చేశారు? అని. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పగలిగే ధైర్యం మనకు ఉండాలి. చరిత్రను కాపాడుకుందాం.ఆ విప్లవ ప్రవాహాన్ని భావి తరాలకు స్వచ్ఛంగా అందిద్దాం.ఎందుకంటే రక్తంతో రాసిన చరిత్రను ఏ నోట్లూ కొనలేవు, ఏ అధికారమూ చెరపలేదు, ఏ కాలమూ మసకబార్చలేదు!



- డా .సూర్యదేవర రామకృష్ణ

## పోతిరెడ్డిపేట ఆరోగ్య కేంద్రం భవనాన్ని పరిశీలించిన డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రవణ్ కుమార్



**హుజురాబాద్.మే 14(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్రం భవనాన్ని గురువారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రవణ్ కుమార్ సందర్శించి భవన నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో చేపట్టిన నిర్మాణ పనుల పురోగతిని ఆయన పరిశీలించి, ఇంకా పూర్తి కావాల్సిన పనులపై అధికారులతో చర్చించారు. భవన నిర్మాణంలో ఉన్న లోటుపాట్లు, సాంకేతిక సమస్యలు, పెండింగ్‌లో ఉన్న పనులపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలతో ఆరోగ్య కేంద్రాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నిర్మాణ పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ఆరోగ్య కేంద్రం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే గ్రామ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అనిల్‌తో పాటు వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# అక్రమ పటాకుల ఫ్యాక్టరీలో ఘోర పేలుడు: ముగ్గురు మృతి



**దేవాస్ జిల్లా తొంకాలన్ గ్రామంలో విషాదం**
**భారీ పేలుడు ధాటికి 25 మందికి తీవ్ర గాయాలు**
**సహాయక చర్యలు చేపట్టిన పోలీసులు, రెస్క్యూ టీమ్స్**



మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దేవాస్ జిల్లాలో గురువారం ఉదయం పెను విషాదం చోటుచేసుకుంది. తొంకాలన్ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఒక పటాకుల తయారీ కేంద్రంలో అకస్మాత్తుగా భారీ పేలుళ్లు సంభవించాయి. ఈ ప్రమాదం ధాటికి ఫ్యాక్టరీ ప్రాంగణం ఒక్కసారిగా దద్దరిల్లిపోగా, అక్కడికక్కడే ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. నిబంధనలకు విరుద్ధంగా జనసామర్థ్యం ఉన్న ప్రాంతానికి సమీపంలో ఈ ఫ్యాక్టరీని నడుపుతున్నట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ఈ భీకర పేలుళ్ల కారణంగా మరో 25 మంది కార్మికులు, స్థానికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలంలో హాహాకారాలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. గాయపడిన వారిలో 13 మందిని చికిత్స నిమిత్తం దేవాస్ జిల్లా ఆసుపత్రికి తరలించగా, మిగిలిన 12 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన వైద్యం కోసం ఇండోర్‌లోని పెద్ద ఆసుపత్రికి తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, గురువారం ఉదయం 11:30 గంటల సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. పటాకుల తయారీకి ఉపయోగించే రసాయనాలు ఒక్కసారిగా అంటుకోవడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. ఈ పేలుడు తీవ్రతకు ఫ్యాక్టరీ పైకప్పు, గోడలు కుప్పకూలిపోయాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు రెస్క్యూ టీమ్స్ గంటల తరబడి శ్రమించాల్సి వచ్చింది. అక్రమంగా నిర్వహిస్తున్న ఈ కేంద్రంలో ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమే ఈ భారీ ప్రాణనష్టానికి కారణమని తెలుస్తోంది. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో పలువురి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు, దీంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఫ్యాక్టరీ యజమాని ఎవరనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను ఎలా నిల్వ చేశారనే అంశంపై ఆరా తీస్తున్నారు. ఈ ఘటనతో తొంకాలన్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అక్రమ పటాకుల తయారీ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం బాధితులకు తక్షణ సహాయం అందించాలని, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తనిఖీలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. జిల్లా యంత్రాంగం ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించింది, బాధ్యులపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హామీ ఇచ్చింది.



# ఉత్తరప్రదేశ్‌లో గాలివాన బీభత్సం

**60 మంది దుర్మరణం**
**భారీ వర్షాలు, ఈదురుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్థంభాలు**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, బలమైన గాలివాన పెను బీభత్సాన్ని సృష్టించాయి. ఈ ప్రకృతి ప్రకోపానికి రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 60 మంది ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. గంటకు భారీ వేగంతో వీచిన ఈదురుగాలుల ధాటికి అనేక చోట్ల భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. రోడ్లపై చెట్లు కూలడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటమే కాకుండా, జనజీవనం పూర్తిగా స్థంభించిపోయింది. ఈ వర్షాల ప్రభావం గ్రామీణ ప్రాంతాలపై తీవ్రంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రయాగ్‌రాజ్, కాన్పూర్, ఫతేపూర్, దేహత్ వంటి జిల్లాల్లో వేలాది ఎకరాల్లో సాగు చేసిన పంటలు నీట మునిగి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. బలమైన గాలుల వల్ల విద్యుత్ స్థంభాలు నేలకొరగడంతో అనేక గ్రామాలు అంధకారంలో మునిగిపోయాయి. పలు చోట్ల పెంకుటి ఇండ్లు, తాత్కాలిక నివాసాలు ధ్వంసమవడంతో పేద ప్రజలు నిరాశ్రయులయ్యారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రులకు తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులపై స్పందించిన భారత వాతావరణ శాఖ, రాబోయే 48 గంటల్లో రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. తుపాను ప్రభావంతో విద్యుత్, సమాచార వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అధికారులు గుర్తించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని, పాత భవనాలు, చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని విపత్తు నిర్వహణ శాఖ సూచనలు జారీ చేసింది. ముందస్తు జాగ్రత్తగా సహాయక బృందాలను సిద్ధం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. విరిగిపడిన చెట్లను, విద్యుత్ స్తంభాలను తొలగించి రవాణా, విద్యుత్ సౌకర్యాలను పునరుద్ధరించే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. జిల్లా కలెక్టర్లు బాధితులకు అవసరమైన ఆహారం, వైద్య సదుపాయాలు అందేలా పర్యవేక్షిస్తున్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. మృతుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గాలివాన బీభత్సం వల్ల కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు కొంత ఆటంకం కలుగుతోంది. అయినప్పటికీ పోలీస్, రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రానున్న రెండు రోజులు అత్యంత కీలకమని, ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారులకు సహకరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.



# మండల–గ్రామ కమిటీలు లేక కాంగ్రెస్ శ్రేణుల్లో రాజకీయ నిరుద్యోగం

**నామినేటెడ్ పదవులు, స్థానిక ఎన్నికలపై ఆశలు ఆవిరి.. కేడర్‌లో పెరుగుతున్న అసహనం**




**వనపర్తి,మే14(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ వనపర్తి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ గ్రామ, మండల స్థాయి నాయకులు-కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. మండల, గ్రామ కమిటీల పదవి కాలం గడువు ముగిసింది. మండల, గ్రామ కమిటీల ఏర్పాటు జరగకపోవడంతో కేడర్ పూర్తిగా నిరాశలోకి వెళ్లిందని అంటున్నారు.ఎన్నికల సమయంలో పార్టీ కోసం గ్రామాల్లో తిరిగి, ఆర్థికంగా ఖర్చు పెట్టి, ప్రత్యర్థులను ఎదుర్కొన్న కార్యకర్తలకు ఇప్పుడు గుర్తింపు లేకుండా పోయిందనే భావన బలపడుతోంది.నామినేటెడ్ పదవుల భర్తీ కూడా ఆలస్యం కావడంతో అధికారంలో ఉన్నామనే ఫీలింగ్ కూడా లేకుండా పోయింది అంటూ పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.ఇక స్థానిక స్థాయిలో కాంట్రాక్టు పనులు లేకపోవడం కూడా కాంగ్రెస్ శ్రేణుల్లో అసంతృప్తికి కారణమవుతోంది. గతంలో అధికార పార్టీలకు అనుబంధంగా పనిచేసే కేడర్‌కు చిన్నపాటి పనులు, కాంట్రాక్టులు, కమిటీల్లో అవకాశాలు దక్కేవని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపించకపోవడంతో కార్యకర్తలు రాజకీయంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.అలాగే సర్పంచ్ ఎన్నికల అనంతరం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరుగుతాయని వనపర్తి జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎంతో ఆశతో ఎదురుచూశారని తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా గ్రామ, మండల స్థాయిలో పార్టీకి మరింత బలం చేకూరుతుందని, కష్టపడ్డ కార్యకర్తలకు రాజకీయ అవకాశాలు లభిస్తాయని భావించినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేడర్‌లో తీవ్ర నిరాశ నెలకొన్నట్లు సమాచారం.ఎన్నికలు ఉంటే కనీసం కార్యకర్తలకు రాజకీయంగా గుర్తింపు దక్కేది అనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.ఈ అసంతృప్తి ఇటీవల వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ మండల కమిటీ ఇంచార్జ్ సమీక్షా సమావేశంలో కూడా బహిర్గతమైనట్లు సమాచారం. ఏప్రిల్ నెలలో నిర్వహించిన ఆ సమావేశంలో పలువురు మండల నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేయడం జరిగింది. ఎన్నికల సమయంలో కష్టపడి పనిచేసి, గ్రామాల్లో తిరిగి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకున్నాం. కానీ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ స్థాయి నాయకులకు, కార్యకర్తలకు గుర్తింపు లేకుండా పోయింది అంటూ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆలస్యం చేయకుండా మండల కమిటీని వెంటనే పూర్తి చేయాలని ఆ సమావేశంలో నాయకులు స్పష్టం చేశారు.అయితే సమావేశం జరిగి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కమిటీ ఏర్పాటు కాకపోవడం కార్యకర్తల్లో మరింత నిరాశను పెంచుతోందని అంటున్నారు.చాలా చోట్ల కార్యకర్తలు ఎమ్మెల్యేలు, మంత్రుల కార్యక్రమాలకు తెల్ల చొక్కాలు వేసుకొని హాజరు కావడానికే పరిమితమయ్యామని లోలోపల అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.గ్రామస్థాయి నాయకత్వానికి ప్రాధాన్యం లేకపోవడం వల్ల పార్టీపై కేడర్‌లో నమ్మకం దెబ్బతింటోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా పార్టీ అధిష్ఠానం మండల, గ్రామ కమిటీల నియామకంతో పాటు నామినేటెడ్ పోస్టుల భర్తీ, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై దృష్టి పెట్టకపోతే రాబోయే రోజుల్లో ఈ అసంతృప్తి మరింత పెరిగే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# తాటి వనంలో యువకుడి దారుణ హత్య

**ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి**



**ఎల్కతుర్తి, మే 14 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని తాటి వనంలో యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన గురువారం స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గౌడిశాల విజయ్ కుమార్ (30) ప్రతిరోజులాగే తన వృత్తి అయిన కల్లు గీసే పనిలో నిమగ్నమై ఉన్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన అక్కినేపల్లి అఖిల్ కల్లు కావాలని అడగగా విజయ్ కుమార్ అతనికి కల్లు ఇచ్చాడు. అనంతరం అక్కడే కూర్చొని కల్లు తాగుతున్న అఖిల్ కొంత సేపటి తర్వాత విజయ్ కుమార్‌తో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. తన భార్యతో అక్రమ సంబంధం ఉందంటూ ఆరోపిస్తూ తన వెంట తెచ్చుకున్న వేట కొడవలితో విజయ్ కుమార్‌పై దాడి చేసినట్లు మృతుడి భార్య గౌడిశాల శ్వేత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడిలో తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో పడి ఉన్న విజయ్ కుమార్‌ను గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి భార్య శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.




# కరీంనగర్ ప్రభుత్వ ఐటిఐల్లో అడ్మిషన్ల సందడి.. పోస్టర్ విడుదల చేసిన మున్సిపల్ చైర్మన్

**జమ్మికుంట టౌన్ మే 14 (తెలంగాణ ముచ్చట్లు):**

కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలు, ఏటీసీలలో 202627 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ప్రభుత్వం అధికారికంగా ఆహ్వానం పలుకుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ తెలిపారు. ఈ మేరకు ప్రవేశాల పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత సాంకేతిక విద్యను అభ్యసించి ఉపాధి అవకాశాలను పొందేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రైవేట్ ఐటీఐలతో పాటు ప్రభుత్వ ఐటీఐలు, ఏటీసీలలో కూడా అర్హులైన విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ కె. అశోక్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (సీఓపీఏ ), డ్రెస్ మేకింగ్, వెల్డర్, మెకానిక్ ఆటో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఐవోటీ టెక్నీషియన్ స్మార్ట్ అగ్రికల్చర్, వర్చువల్ అనాలిసిస్ అండ్ డిజైనర్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్, అడ్వాన్స్డ్ సీఎన్‌సీ టెక్నీషియన్, మ్యానుఫాక్చరింగ్ ప్రాసెసింగ్ ఆటోమేషన్ కంట్రోల్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

అభ్యర్థులు SSC అర్హతతో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, https://iti.telangana.gov.inవెబ్‌సైట్‌లో రూ.100 ఫీజు చెల్లించి వచ్చే నెల 8వ తేదీలోపు దరఖాస్తు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎండీ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో వీఐ 5జీ సేవలు ప్రారంభం

దేశీయ టెలికాం రంగంలో ఐదు జీ సేవల విస్తరణ వేగంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో ప్రముఖ టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా హైదరాబాద్ నగరంలో అధికారికంగా ఐదు జీ సేవలను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇప్పటికే తిరుపతి, విశాఖపట్నం నగరాల్లో ఐదు జీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన సంస్థ, ఇప్పుడు తెలంగాణ రాజధానిలో కూడా ఈ సాంకేతిక సేవలను విస్తరించింది. దేశంలో డేటా వినియోగం అత్యధికంగా ఉన్న ప్రధాన నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలుస్తోందని కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులకు మరింత వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందించేందుకు నగరంలో ఐదు జీ సేవలను ప్రారంభించినట్లు వెల్లడించాయి. ముఖ్యంగా వీడియో స్ట్రీమింగ్, ఆన్‌లైన్ గేమింగ్, క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధస్సు ఆధారిత డిజిటల్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఈ సేవలకు మంచి డిమాండ్ ఉంటుందని భావిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఐదు జీ సేవల విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అనేక టెలికాం టవర్లను ఆధునీకరించినట్లు సంస్థ తెలిపింది. ఆధునిక నెట్‌వర్క్ సాంకేతికతను ఉపయోగించి వినియోగదారులకు అధిక వేగంతో పాటు మెరుగైన కనెక్టివిటీ అందించేలా చర్యలు చేపట్టినట్లు వివరించింది. నగరంలోని కీలక ప్రాంతాల్లో ఇప్పటికే నెట్‌వర్క్ పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.ఐదు జీ సాంకేతికత ద్వారా వినియోగదారులు అధిక వేగంతో డౌన్‌లోడ్లు, తక్కువ ఆలస్యంతో వీడియో కాల్స్, మెరుగైన డిజిటల్ సేవలను పొందగలరని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా సమాచార సాంకేతిక రంగం, స్టార్టప్ సంస్థలు, డిజిటల్ సేవల రంగానికి హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా మారుతున్న నేపథ్యంలో ఐదు జీ విస్తరణకు ప్రాధాన్యం పెరిగింది. దేశవ్యాప్తంగా ఇప్పటికే పలు టెలికాం సంస్థలు ఐదు జీ సేవలను విస్తరిస్తుండగా, ఇప్పుడు వొడాఫోన్ ఐడియా కూడా తన నెట్‌వర్క్ విస్తరణను వేగవంతం చేస్తోంది. రాబోయే నెలల్లో మరిన్ని నగరాల్లో కూడా ఐదు జీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.




# బ్యాంకుల్లో ఐదు రోజుల పనిదినాలపై మళ్లీ డిమాండ్

దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంలో వారానికి ఐదు రోజుల పనిదినాల అమలుపై మరోసారి చర్చ ప్రారంభమైంది. బ్యాంకు ఉద్యోగ సంఘాలు చాలా కాలంగా చేస్తున్న ఈ డిమాండ్‌ను మళ్లీ కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాయి. వారానికి ఐదు రోజుల పని విధానాన్ని తక్షణమే అమలు చేయాలని కోరుతూ బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు ప్రధాని నరేంద్ర మోదీకు లేఖ రాశాయి.

దేశవ్యాప్తంగా బ్యాంకు అధికారులను ప్రాతినిధ్యం వహిస్తున్న ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించింది. ఐదు రోజుల పనిదినాల అమలు కేవలం ఉద్యోగుల సేవా నిబంధనలకు సంబంధించిన అంశం మాత్రమే కాదని, ఇది ఇంధన పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, శక్తి వినియోగ తగ్గింపు, కార్యనిర్వహణ సామర్థ్యం వంటి అనేక ప్రయోజనాలకు దోహదపడుతుందని సంఘం పేర్కొంది.

ప్రస్తుతం బ్యాంకు ఉద్యోగులు భారీ పని ఒత్తిడిలో పనిచేస్తున్నారని సంఘం వెల్లడించింది. శాఖల నిర్వహణ, నగదు లావాదేవీలు, వినియోగదారుల సేవలు, రుణ వసూళ్లు, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామీణ ఆర్థిక సేవల విస్తరణ వంటి బాధ్యతల కారణంగా ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతోందని తెలిపింది. ఈ పరిస్థితుల్లో వారానికి ఐదు రోజుల పనివిధానం అమలు చేస్తే ఉద్యోగుల సామర్థ్యం మరింత మెరుగవుతుందని అభిప్రాయపడింది.

అలాగే ఈ నిర్ణయం వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది బ్యాంకు ఉద్యోగుల ప్రయాణ భారం తగ్గుతుందని సంఘం పేర్కొంది. ఒక రోజు అదనపు సెలవు కారణంగా పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గడంతో పాటు ట్రాఫిక్ రద్దీ కూడా కొంత మేర తగ్గే అవకాశం ఉందని వివరించింది. విద్యుత్ వినియోగం, కార్యాలయ నిర్వహణ ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపింది.

ప్రస్తుతం అనేక ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో ఐదు రోజుల పని విధానం అమలులో ఉందని, బ్యాంకింగ్ రంగంలో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని ఉద్యోగ సంఘాలు వాదిస్తున్నాయి. ముఖ్యంగా డిజిటల్ బ్యాంకింగ్ సేవలు విస్తరించిన నేపథ్యంలో శాఖలకు ప్రత్యక్షంగా వచ్చే వినియోగదారుల సంఖ్య కూడా గతంతో పోలిస్తే తగ్గిందని పేర్కొంటున్నాయి. ఇక బ్యాంకింగ్ రంగంలో ఐదు రోజుల పని విధానం అమలుపై గతంలో కూడా పలు మార్లు చర్చలు జరిగినప్పటికీ ఇంకా తుది నిర్ణయం వెలువడలేదు. కేంద్ర ఆర్థిక శాఖ, భారతీయ బ్యాంకుల సంఘం, ఉద్యోగ సంఘాల మధ్య ఈ అంశంపై గతంలో చర్చలు జరిగినట్లు సమాచారం. అయితే ఇప్పటి వరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని బ్యాంకు ఉద్యోగ సంఘాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.




# పాల ధరలు పెంపు.. సామాన్యులకు మరో భారం

నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ప్రముఖ డైరీ సంస్థలు మరో షాక్ ఇచ్చాయి. దేశీయ ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ అమూల్ పాలు ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. అమూల్ బ్రాండ్ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ అన్ని రకాల పాల ప్యాకెట్లపై లీటరుకు రెండు రూపాయల చొప్పున ధరలు పెంచింది. ఈ కొత్త ధరలు మే 14 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ధరల పెంపుతో అరలీటర్ అమూల్ గోల్డ్, అమూల్ తాజా, అమూల్ శక్తి పాల ప్యాకెట్ల ధర ఒక్కో రూపాయి మేర పెరిగింది. లీటర్ అమూల్ గోల్డ్ పాలు ధర 68 రూపాయల నుంచి 70 రూపాయలకు చేరగా, అమూల్ తాజా ధర 55 రూపాయల నుంచి 57 రూపాయలకు పెరిగింది. అమూల్ బాటలోనే మరో ప్రముఖ డైరీ సంస్థ మదర్ డెయిరీ కూడా పాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా ఢిల్లీ పరిసర ప్రాంతాలు, ఇతర నగరాల్లో లీటర్ పాలపై రెండు రూపాయల వరకు పెంపు అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. గేదె పాలు ధర లీటరుకు 75 రూపాయల నుంచి 80 రూపాయలకు పెరగగా, ఫుల్ క్రీమ్ పాలు ధర 69 రూపాయల నుంచి 72 రూపాయలకు చేరుకుంది. పాల ధరల పెంపుకు అనేక కారణాలు ఉన్నాయని డైరీ సంస్థలు చెబుతున్నాయి. ముఖ్యంగా పశువుల దాణా ధరలు భారీగా పెరగడం ప్రధాన కారణంగా పేర్కొంటున్నాయి. గడ్డి, తవుడు, ఇతర పశు ఆహార పదార్థాల ధరలు పెరగడంతో పాల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరిగిందని సంస్థలు వెల్లడించాయి. అదేవిధంగా రవాణా ఖర్చులు కూడా పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావంతో గ్రామాల నుంచి నగరాలకు పాలను తరలించే వ్యయం అధికమైందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

వేసవి కాలంలో సాధారణంగా పాల దిగుబడి తగ్గడం వల్ల సరఫరాపై ఒత్తిడి పెరిగిందని, దీంతో ధరలు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటున్నాయి.ప్యాకేజింగ్ ఖర్చులు, విద్యుత్ ఛార్జీలు, శీతలీకరణ నిర్వహణ వ్యయాలు పెరగడం కూడా ధరల పెంపుకు కారణమయ్యాయి. ఈ అదనపు భారం చివరకు వినియోగదారులపైనే పడుతోందని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే కూరగాయలు, వంటనూనెలు, గ్యాస్, ధాన్యాల ధరలు పెరిగిన పరిస్థితుల్లో ఇప్పుడు పాల ధరలు కూడా పెరగడంతో సామాన్య కుటుంబాల నెలవారీ బడ్జెట్‌పై మరింత భారం పడనుంది. ముఖ్యంగా చిన్నపిల్లలు ఉన్న కుటుంబాలు, హోటళ్లు, టీ దుకాణాలు, స్వీట్లు తయారీదారులపై ఈ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశముంది. ధరల పెరుగుదల నేపథ్యంలో కొంతమంది వినియోగదారులు స్థానిక డైరీ కేంద్రాలు, ప్రభుత్వ పాల సరఫరా సంస్థల వైపు మొగ్గు చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో విజయ డెయిరీ వంటి ప్రభుత్వ పాల కేంద్రాల వద్ద ధరలు కొంత వరకు నియంత్రణలో ఉండే అవకాశముందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

# జియో ప్లాట్‌ఫామ్స్ ఎండీగా ఆకాశ్ అంబానీ




దేశీయ డిజిటల్ రంగంలో కీలక స్థానాన్ని సంపాదించిన జియో ప్లాట్‌ఫామ్స్ సంస్థకు కొత్త నాయకత్వం లభించింది. రిలయన్స్ గ్రూప్ వారసుడిగా గుర్తింపు పొందిన ఆకాశ్ అంబానీను జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించినట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ నియామకం ఏప్రిల్ 9 నుంచి అమల్లోకి వచ్చినట్లు కంపెనీ తన నియంత్రణ సంస్థలకు సమర్పించిన నివేదికలో వెల్లడించింది. వచ్చే ఐదేళ్ల పాటు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగనున్నట్లు పేర్కొంది.

రిలయన్స్‌కు చెందిన డిజిటల్ సేవల విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ త్వరలో షేర్ మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతున్న వేళ ఈ నియామకం ప్రాధాన్యతను సంతరించుకుంది. సంస్థ ప్రారంభ ప్రజావాటాల విక్రయం కోసం ముసాయిదా పత్రాలను ఈ నెలాఖరు లేదా వచ్చే నెలలో మార్కెట్ నియంత్రణ సంస్థకు సమర్పించే అవకాశాలు ఉన్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో సంస్థ భవిష్యత్ వ్యూహాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఆకాశ్ అంబానీకి కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఆకాశ్ అంబానీ ఇప్పటికే జియో టెలికాం సేవల విభాగంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. 2014 అక్టోబర్ నుంచి రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ బోర్డు సభ్యుడిగా కొనసాగుతున్న ఆయన, 2022లో సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. యువ నాయకుడిగా టెక్నాలజీ రంగంపై మంచి పట్టు కలిగిన ఆకాశ్, జియో విస్తరణలో ప్రధాన పాత్ర పోషించిన వారిలో ఒకరిగా గుర్తింపు పొందారు.

ఆకాశ్ అంబానీ నాయకత్వంలో జియో టెలికాం రంగంలో సంచలన వృద్ధిని నమోదు చేసింది. 2016లో ప్రారంభమైన కొద్ది నెలల్లోనే కోట్లాది వినియోగదారులను ఆకర్షించి దేశీయ టెలికాం రంగంలో భారీ మార్పులకు కారణమైంది. కేవలం ఆరు నెలల్లోనే 10 కోట్ల మంది వినియోగదారులను సొంతం చేసుకుని కొత్త రికార్డు సృష్టించింది. తక్కువ ధరల డేటా సేవలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ విస్తరణ ద్వారా జియో దేశవ్యాప్తంగా వేగంగా విస్తరించింది. ఇటీవల విడుదల చేసిన ఆర్థిక గణాంకాల ప్రకారం జియో ప్లాట్‌ఫామ్స్ భారీ ఆదాయాలు నమోదు చేసింది. 2026 ఆర్థిక సంవత్సరానికి గాను సంస్థ రూ.1.46 లక్షల కోట్ల ఆదాయాన్ని, దాదాపు రూ.30 వేల కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు వెల్లడించింది. డిజిటల్ సేవలు, మొబైల్ కమ్యూనికేషన్, వినోదం, ఆన్‌లైన్ సేవల రంగాల్లో జియో విస్తరణ కొనసాగుతున్న నేపథ్యంలో సంస్థ భవిష్యత్‌పై పెట్టుబడిదారుల్లో ఆసక్తి పెరుగుతోంది.

జియో ప్లాట్‌ఫామ్స్‌కు ఆకాశ్ అంబానీ నాయకత్వం రావడం ద్వారా డిజిటల్ రంగంలో సంస్థ మరింత దూసుకెళ్లే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, క్లౌడ్ సేవలు, డిజిటల్ చెల్లింపులు, వినోద రంగాల్లో సంస్థ మరిన్ని విస్తరణ ప్రణాళికలను అమలు చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

శుక్రవారం - 15 - మే 2026

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# చిన్న వయసులోనే పెళ్లి.. కెరీర్‌పై ఆనంది ఆసక్తికర వ్యాఖ్యలు

సినీ పరిశ్రమలో హీరోయిన్‌ల కెరీర్, వివాహం గురించి ఉన్న సాధారణ అభిప్రాయాలపై నటి ఆనంది ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పెళ్లి చేసుకున్న తర్వాత హీరోయిన్‌ల కెరీర్ దెబ్బతింటుందనే భావన ఇప్పటికీ చాలామందిలో ఉందని ఆమె పేర్కొన్నారు. అయితే తన జీవితమే ఆ అభిప్రాయాలకు సమాధానమని చెప్పిన ఆనంది.. పెళ్లి, పిల్లలు, కెరీర్ మధ్య ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆనంది.. సినిమాల్లో కూడా హీరోయిన్‌ల పెళ్లిపై పలు అపోహలను చూపిస్తుంటారని అన్నారు. "కొన్ని సినిమాల్లో హీరోయిన్ పెళ్లి చేసుకుంటే కెరీర్ ముగిసినట్టే అన్న భావన కనిపిస్తుంది. ఇప్పటికీ చాలామంది అదే అనుకుంటున్నారు. చాలా మంది నటీమణులు 35 లేదా 38 ఏళ్ల తర్వాతే వివాహం చేసుకుంటున్నారు. కొందరు అయితే పెళ్లి చేసుకోకుండా కెరీర్‌పైనే దృష్టి పెడుతున్నారు" అని చెప్పారు.అయితే తాను మాత్రం చాలా చిన్న వయసులోనే వివాహం చేసుకుని కూడా కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నానని ఆనంది తెలిపారు. "నేను 23 ఏళ్లకే పెళ్లి చేసుకున్నాను. అయినా నా కెరీర్‌కు ఎలాంటి ఇబ్బంది రాలేదు. ఇండస్ట్రీలో ఒకరిని నిలబెట్టేది టాలెంట్, నటన, పనితీరు మాత్రమే. పెళ్లి చేసుకున్నామా లేదా అన్నది కాదు" అని స్పష్టం చేశారు. తన వివాహం గురించి మాట్లాడుతూ.. అది కుటుంబ సభ్యుల అభిప్రాయం, తన నిర్ణయం రెండింటి కలయిక అని వెల్లడించారు. "నా తల్లిదండ్రులు అదే సరైన సమయం అనుకున్నారు. నాకు కూడా ఆయన సరైన వ్యక్తి అనిపించారు. అందుకే పెళ్లికి అంగీకరించాను" అని చెప్పారు. కోవిడ్ కాలంలో తన జీవితంలో చాలా మంచి మార్పులు జరిగాయని, ఆ సమయం తన ఆలోచనా విధానాన్ని కూడా మార్చిందని పేర్కొన్నారు.

ఆనంది భర్త సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తి కాకపోవడం అప్పట్లో చాలామందిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఆమె ఒక మెరైన్ ఇంజనీర్‌ను వివాహం చేసుకున్నారు. ఈ విషయంపై స్పందిస్తూ.. "చాలామంది నేను ఓ స్టార్ హీరోని పెళ్లి చేసుకుంటానని అనుకున్నారు. కానీ నాకు వ్యక్తిత్వం ముఖ్యం. నా భర్త చాలా పుస్తకాలు చదువుతారు. ఆయన ఆలోచనా విధానం నాకు బాగా నచ్చింది" అని తెలిపారు. తమ పరిచయం ఎలా మొదలైందో కూడా ఆనంది వెల్లడించారు. "ఆయన నా దర్శకుడి భార్య తమ్ముడు. షూటింగ్ సమయంలో సెట్‌కు వచ్చేవారు. ప్రొడక్షన్, కెమెరా పనుల్లో సహాయం చేసేవారు. మొదట సాధారణ పరిచయమే. తర్వాత ప్రయాణాల సమయంలో క్విజ్ గేమ్స్ ఆడుతూ మా మధ్య స్నేహం పెరిగింది" అని చెప్పారు. దాదాపు 50 రోజుల పాటు ఆయనను గమనించిన తర్వాతే వివాహం గురించి నిర్ణయం తీసుకున్నానని ఆనంది తెలిపారు. "మా తల్లిదండ్రులకు కూడా ఆయన నచ్చారు. అలా మా పెళ్లి కుదిరింది.

ఇది పెద్ద ప్రేమకథ కాదు. నేరుగా పెళ్లి ప్రపోజల్ వచ్చింది" అని నవ్వుతూ చెప్పారు. డబ్బు, ఆస్తుల కంటే వ్యక్తిత్వానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని ఆనంది స్పష్టం చేశారు. "నాకు బిలియనీర్లు, మిలియనీర్లు అవసరం లేదు. బంగ్లాలు, కార్లు నేను స్వయంగా సంపాదించుకోగలను. జీవిత భాగస్వామిలో మంచి మనసు, అర్థం చేసుకునే స్వభావం ఉండటం ముఖ్యం" అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆనంది చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చిన్న వయసులో పెళ్లి చేసుకుని కూడా కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్న ఆమె నిర్ణయాన్ని చాలామంది ప్రశంసిస్తున్నారు.



# 'పెద్ది' కోసం దేశవ్యాప్తంగా భారీ ప్రచారం

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కిస్తున్న 'పెద్ది' సినిమాపై ఇప్పటికే సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను చిత్రబృందం దేశవ్యాప్తంగా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తిని పెంచగా, ఇప్పుడు ప్రచార కార్యక్రమాల షెడ్యూల్ కూడా అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సినిమాలో రామ్ చరణ్ పూర్తిగా మాస్ పాత్రలో కనిపించనున్నారని ఇప్పటికే విడుదలైన దృశ్యాలు స్పష్టం చేశాయి. ముఖ్యంగా కుస్తీ, క్రికెట్ నేపథ్యాల్లో సాగే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని అభిమానులు భావిస్తున్నారు. గ్రామీణ భావోద్వేగాలు, క్రీడా స్ఫూర్తి, మాస్ యాక్షన్ అంశాలను కలగలిపి దర్శకుడు బుచ్చిబాబు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'పెద్ది'పై పాన్ ఇండియా స్థాయిలో భారీ హైప్ ఏర్పడింది. ఇటీవల ఓ అభిమాని సోషల్ మీడియాలో "పెద్ది ప్రమోషన్స్ ఎక్కడ?" అంటూ ప్రశ్నించగా, దానికి స్పందించిన చిత్రబృందం 'పవర్ ప్లే టూర్' పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాల వివరాలను విడుదల చేసింది. ఈ టూర్‌లో భాగంగా దేశంలోని ప్రధాన నగరాల్లో వరుస ఈవెంట్లు నిర్వహించనున్నారు. మే 18న ముంబైలో జరిగే భారీ కార్యక్రమంలో సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. బాలీవుడ్ మీడియా దృష్టిని ఆకర్షించేలా ఈ వేడుకను అత్యంత గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

ఆ తర్వాత మే 22న హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో భారీ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమం జరగనుంది. ఈ ఈవెంట్‌లో ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీత ప్రదర్శన కూడా ఉండే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. భారీ సంఖ్యలో అభిమానులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. మే 23న భోపాల్‌లో ప్రత్యేక పాటల విడుదల కార్యక్రమం నిర్వహించనుండగా, మే 24న బెంగళూరులో మరో ప్రచార వేడుక జరగనుంది. ఇక మే 28న ఢిల్లీలో, మే 30న చెన్నైలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జూన్ 1న విజయనగరంలో అభిమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. సినిమా కథ ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగనున్న నేపథ్యంలో విజయనగర కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. చివరగా జూన్ 2న హైదరాబాద్‌లో భారీ ప్రీ రిలీజ్ వేడుకను అభిమానుల సమక్షంలో నిర్వహించనున్నారు.




# 'స్పిరిట్' కోసం భారీ పోలీస్ స్టేషన్ సెట్‌లో ప్రభాస్ సందడి

రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్' సినిమా షూటింగ్‌లో ఫుల్ బిజీగా ఉన్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా కొనసాగుతోంది. ఈ షెడ్యూల్ కోసం ప్రత్యేకంగా నిర్మించిన భారీ పోలీస్ స్టేషన్ సెట్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. దాదాపు 60 రోజుల పాటు కొనసాగే ఈ దీర్ఘ షెడ్యూల్‌లో సినిమాకు అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. 'స్పిరిట్' సినిమాలో ప్రభాస్ పవర్‌ఫుల్ ఐపీఎస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటివరకు ఆయన చేసిన పాత్రలతో పోలిస్తే ఇది పూర్తిగా భిన్నంగా ఉండబోతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో ప్రభాస్‌ను మరింత ఇంటెన్స్, అగ్రెసివ్ అవతార్‌లో చూపించేందుకు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. పోలీస్ అధికారిగా ప్రభాస్ బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, యాక్షన్ స్టైల్ అభిమానులకు కొత్త అనుభూతిని కలిగిస్తాయని టాక్ వినిపిస్తోంది.ఇక యాక్షన్ సీక్వెన్స్‌ల విషయంలో కూడా 'స్పిరిట్' సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ 60 రోజుల షెడ్యూల్‌లోనే నాలుగు భారీ యాక్షన్ ఎపిసోడ్స్‌ను పూర్తి చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఇంటర్వెల్ బ్లాక్, క్లైమాక్స్‌కు సంబంధించిన కీలక ఫైట్ సన్నివేశాలు ఈ పోలీస్ స్టేషన్ సెట్లోనే చిత్రీకరించనున్నారని టాక్. హాలీవుడ్ స్థాయి యాక్షన్ ట్రీట్ ఇవ్వాలనే లక్ష్యంతో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ సన్నివేశాలను డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in